PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 155 | విజయవాడ, సోమవారం 8 జనవరి 2024 | 6 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Monday 8 January 2024 | Rs



కొల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో ఆదివారం డివైఎఫ్ఐ నిర్వహించిన ర్యాలీకి లక్షలాదిగా తరలివచ్చిన యువతీ, యువకులు

# కదం తొక్కిన యువత

## బ్రిగేడ్ సలాం... ఇసుకేస్తే రాలనంత జనం

## డివైఎఫ్ఐ మహా ర్యాలీ గ్రాండ్ సక్సెస్

యువత పెద్దయెత్తున పోటెత్తడంతో కొల్‌కతా బ్రిగేడ్ మైదానం జన సంద్రంగా మారింది. అందరికీ ఉపాధి, విద్య, కల్పించాలని, అవినీతి, మత విద్వేషాలను రూపుమాపాలని నినదిస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో యాభై రోజులుగా రాష్ట్రంలోని 22 జిల్లాల మీదుగా 2,400 కి.మీ పొడవునా సాగిన సుదీర్ఘ 'ఇన్సాఫ్ యాత్ర' పతాక సన్నివేశంగా నిర్వహించిన ఈ భారీ ర్యాలీకి ఇసుకవేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. గత ఏడాది నవంబరు3న కూచ్ బిహార్‌లో మొదలైన ఈ యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీస్తున్న కేంద్రంలోని మతతత్వ బిజెపిని, బెంగాల్‌లో హింస, అవినీతికి కేరాఫ్‌గా మారిన మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని, బెంగాల్ పునరుజ్జీవనానికి వామపక్షాలను బలపర్చాలని ఈ మహా ర్యాలీనుద్దేశించి ప్రసంగించిన వక్తలు పిలుపునిచ్చారు.

6

# అప్రజాస్వామికం

- ప్రజాస్వామ్య స్ఫూర్తికి దెబ్బ
- ఫెడరలిజం సూత్రాల ఉల్లంఘన
- జమిలి ఎన్నికల ప్రతిపాదనపై కమిటీకి సిపిఐ(ఎం) లేఖ

**న్యూఢిల్లీ :** దేశంపై జమిలి ఎన్నికలను రుద్దేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై సిపిఐ(ఎం) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విధానం పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆరోపించింది. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక'పై కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీకి ఈ మేరకు ఆదివారం ఓ లేఖ రాసింది. కమిటీ కార్యదర్శిని ఉద్దేశిస్తూ రాసిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించింది. జమిలి ఎన్నికలపై సూచనలు కోరుతూ 2023 అక్టోబర్ 18న హైలెవెల్ కమిటీ రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరంగా సిపిఐ(ఎం) ఈ లేఖ రాసింది.

'ఒకే దేశం...ఒకే ఎన్నిక' విధానాన్ని రుద్దేందుకు జరుగుతున్న యత్నాలపై మేము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాము. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని ఉన్నత స్థాయి కమిటీకి ఇచ్చిన సూచనలు స్పష్టం చేస్తున్నాయి. దాని అమలు పైనే ఇప్పుడు సూచనలు స్వీకరిస్తున్నారు. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం న్యాయపరమైన, పాలనాపరమైన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన సూచనలు చేయడానికి మాత్రమే కమిటీ పరిమితమైందన్న విషయం అక్టోబర్ 18న మీరు రాసిన లేఖ ద్వారా స్పష్టమైంది. జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలించి, దేశంలో వాటిని నిర్వహించేందుకు సూచనలు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయ శాఖ 2023 సెప్టెంబర్ 2న ఓ తీర్మానం ద్వారా తెలియజేసింది. కమిటీ ఏర్పాటుపై సిపిఐ(ఎం) తీవ్ర నిరసనను తెలియజేసింది. ఎందుకంటే దాని అజెండాను, గమ్యాన్ని ముందే నిర్ణయించారు' అని ఆ ప్రకటనలో సిపిఐ(ఎం) తెలిపింది. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన వచ్చినప్పటి నుండి సిపిఐ(ఎం) తన వ్యతిరేకతను, ఆందోళనను వ్యక్తం చేస్తూనే ఉన్నదని ఆ లేఖలో పార్టీ గుర్తు చేసింది. 'ఇదే అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు మిగతా 2లో



విజయ సంకేతం చూపిస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసినా

# మళ్లీ హసీనాకే పట్టం

- 225 స్థానాల ఫలితాల వెల్లడి
- అవామీలీగ్‌కు 172
- 40 శాతం ఓటింగ్
- 14 పోలింగ్ స్టేషన్లు, రెండు స్కూళ్లకు నిప్పు
- ఎన్నికలు బహిష్కరించిన బిఎన్‌పి

లోపలి పేజీలో..

# ఏం చేద్దాం!

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ సవరణలకు సర్కారు కసరత్తు
- న్యాయనిపుణులతో చర్చలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022పై భూ యజమానులు, రైతులు, న్యాయవాదుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ఎన్నికలకు కేవలం మూడు నెలలు మాత్రమే సమయం ఉండటం, టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం ఏం చేయాలా? అని పునరాలోచనలో పడింది. ఇదిలా ఉంటే ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు)తో పాటు పలు సంస్థలు హైకోర్టులో పిల్ వేయడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ప్రారంభ దశలోనే నష్ట నివారణ చర్యలు చేపట్టకపోతే తెలంగాణలో 'ధరణి' పోర్టల్‌ను ప్రతిపక్షాలు ఎన్నికల ఆయుధంగా మలచుకున్నట్లు రాష్ట్రంలో కూడా ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను ప్రచారాస్త్రంగా చేసుకుని లబ్ధి పొందుతాయేమోననే ఆందోళన పాలకపక్షంలో కనబడుతోంది. ప్రజల్లో యాక్ట్‌కు వ్యతిరేకంగా ప్రచారం జరిగితే చాపకింద నీరులా ఓటు బ్యాంక్‌కు గండి పడే అవకాశాలు కూడా లేకపోలేదనే భయం అధికార పార్టీని వెంటాడుతోంది. ప్రభుత్వ వర్గాలు, నల్సార్ యూనివర్సిటీ న్యాయ నిపుణులు, లా డిపార్టుమెంట్‌లోని నిపుణులు, ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వం ప్రాథమికంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనప్పటికీ ప్రాథమికంగా అందుతున్న సమాచారం మేరకు చట్టంలో పలు సవరణలు తీసుకురాక తప్పదనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతుంది. ఇదే విషయంపై ఫిబ్రవరి 7న హైకోర్టులో వాయిదా ఉన్న నేపథ్యంలో హైకోర్టుకు అభ్యంతరాలపై ఏదో ఒక సమాధానం ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌లో పేర్కొన్న పలు సెక్షన్లు భూ యజమానుల పాలిట గుది బండగా మారనున్నాయనే అభిప్రాయం ప్రజల్లో బలంగా వినబడుతోంది. ముఖ్యంగా భూ హక్కుల చట్టంలో 69 సెక్షన్లు ఉండగా అందులో 7, 9, 13, 37, 46, 64 వివాదంతో కూడుకుని, యజమానులకు నష్టాలను కలిగించే సెక్షన్లుగా పరిగణించాలని భూయజమానుల అభిప్రాయం. రాష్ట్రంలో 535 సివిల్ కోర్టులు ఉన్నా అధికారులతో ఏర్పాటుచేసిన 26 రెవెన్యూ ట్రిబ్యునల్‌తో వివాదాలను పరిష్కరించడం ఎలా సాధ్యమనే అభిప్రాయం భూ యజమానులు, అడ్వకేట్స్ నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తోంది. ఇప్పటి వరకు భూములకు సంబంధించిన సమస్యలు వచ్చిన సందర్భంలో సివిల్ కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండేది. ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమల్లోకి వస్తే సివిల్ కోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని, కేవలం హైకోర్టులో మాత్రమే అప్పీల్ చేసుకునే అవకాశం ఉండటం సామాన్యులకు ఆర్థిక భారంగా మారుతుందనే ఆందోళన సన్న, చిన్నకారు రైతుల్లో నెలకొంది.

**టిఆర్‌ఒగా తహశీల్దార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్లు**

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022లో పేర్కొన్న విధంగా టైట్లింగ్ రిజిస్ట్రేషన్ అధికారాలు టిఆర్‌ఒగా వ్యవహరించే తహశీల్దార్లకు కల్పిస్తోంది. ప్రజల అభ్యంతరాల నేపథ్యంలో తహశీల్దార్‌తోపాటు సబ్ రిజిస్ట్రార్‌కు కూడా కల్పిస్తే ఎలా ఉంటుందనే అంశంపై ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు న్యాయ నిపుణులతో సంప్రదిస్తున్నారు. వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ అధికారాలు టిఆర్‌ఒగా వ్యవహరించే తహశీల్దార్లకు, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ అధికారాలు సబ్ రిజిస్ట్రార్లతో పాటు అదనంగా మరికొందరికి టిఆర్‌ఒ అధికారాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

# మేమొస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం

- తిరువూరు, భీమవరం సభల్లో చంద్రబాబు



తిరువూరులో 'రా... కదలి రా' బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

**ప్రజాశక్తి- తిరువూరు, భీమవరం**

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను తీసుకొచ్చిన ఐటి రంగంతో, సైబర్‌బాద్ అభివద్ధితో హైదరాబాద్ వెలిగిపోతుంటే నేడు జగన్ పాలనలో రాష్ట్ర రాజధాని అమరావతి వెలవెలబోతోందన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి పోయిందని, మళ్లీ కోలుకోలేని విధంగా రాష్ట్రాన్ని జగన్ దెబ్బతీశారని విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా కదలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం జరిగిన 'రా... కదలి రా' బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని, రుషికొండను బోడి గుండు చేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారని విమర్శించారు. ఓ వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం, ఒక తరం ఇంతగా నష్టపోయిన పరిస్థితి దేశంలోనే కాదు ప్రపంచంలోనూ ఎక్కడా లేదన్నారు. ఈ రాష్ట్రంలో నాతో సహా అందరూ జగన్ బాధితులేనని వివరించారు. అరాచక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసేశారని, ధాన్యం రైతులు దగా పడ్డారని, రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని విమర్శించారు. రైతుల బతుకులు బాగుపడాలంటే టిడిపి-జనసేన ప్రభుత్వం రావాలన్నారు. సంక్షేమ పథకాలకు నాంది పలికింది టిడిపి అని, జగన్ పాలనలో వంద పథకాలను రద్దు చేశారని వివరించారు. ఎమ్మెల్యేలను వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసిన సందర్భాలు గతంలో లేవని, గుంటూరు ఎంపి టికెట్ పేరుతో అంబటి రాయుడును కూడా జగన్ మోసగించారని దుయ్యబట్టారు. గత నాలుగున్నరేళ్లలో బటన్ నొక్కానంటూ జనాలను మోసగించారని, పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు లాగేసుకున్నారని, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు ఇష్టానుసారం పెంచారని, పెట్రోలు, డీజిల్ ధరలు, నిత్యావసరాల ధరలు పెరిగినా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఆక్వా రంగాన్ని వైసిపి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందన్నారు. పోలవరాన్ని పరుగులు పెట్టించి 72 శాతం పూర్తి చేశానని, వైసిపి వచ్చాక గోదాట్లో కలిపిందని విమర్శించారు. పోలవరాన్ని పూర్తి చేసి నదుల అనుసంధానంతో మూడు పంటలకు సాగు నీరందిస్తామన్నారు. జగనన్న ఎక్కుపెట్టిన బాణం షర్మిల ఇప్పుడు జగన్‌పైకే వస్తోందని ఎద్దేవా చేశారు. బిసిల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టిలకు, మైనార్టీలకు వైసిపి ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. కాపులకూ తీవ్ర అన్యాయం చేసిందని, రిజర్వేషన్లను సైతం అడ్డుకుందని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆక్వా యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్లను అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



సిపిఎం అనకాపల్లి జిల్లా నాయకులు

# బాలకృష్ణ కన్నుమూత

- ఎఎంసికి భౌతికకాయం అప్పగింత

**ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి**

సిపిఎం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నాయకులు, ఎపి కౌలు రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అంగులూరి బాలకృష్ణ (65) అనారోగ్యంతో విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని అనకాపల్లిలోని దాసరిగెడ్డ రోడ్డు గవరపాలెంలో ఉన్న స్వగృహానికి తరలించారు. అక్కడి నుంచి సిపిఎం జిల్లా కార్యాలయానికి ర్యాలీగా తీసుకొచ్చారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల సందర్శనార్థం విశాఖపట్నం జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయానికి తీసుకొచ్చి కొద్దిసేపు ఉంచారు. ఆ తర్వాత ఆంధ్రా మెడికల్ కాలేజీకి భౌతికకాయాన్ని అప్పగించారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమారుడు వెంకట సత్యప్రసాద్ (కౌశిక్) ఉన్నారు.

# నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

2

## ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు



విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరం ప్రసంగిస్తున్న బివి రాఘవులు

## అంగన్‌వాడీలపై ఎస్మా రద్దు చేయకపోతే

# ప్రభుత్వాన్ని సాగనంపుతారు

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- అవసరమైతే రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరిక

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మాను రద్దు చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రజలే ఇంటికి పంపిస్తారని, లక్షమంది మహిళల పట్ల అమానుషంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని సాగనంపే వరకూ ఊరుకునేది లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరిన సందర్భంగా ధర్నా చౌక్‌లోని దీక్షా శిబిరానికి ఆదివారం వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, న్యూడెమొక్రసీ, అమ్‌ఆద్మీ, ఎంఎల్ పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా బి.వి.రాఘవులు మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మలు అంటూ ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తరువాత లక్షమంది అంగన్‌వాడీలకు అన్యాయం చేశారని విమర్శించారు. ఐసిడిఎస్‌ను అత్యవసర సర్వీసుగా పరిగణించామని ఎస్మా జిఓ ఇచ్చారని, అలాంటప్పుడు 26 రోజుల నుండి వారి సమస్యలు పరిష్కరించకుండా ఎందుకున్నారని ప్రశ్నించారు. ఎస్మా ప్రయోగించడం ద్వారా అంగన్‌వాడీలను బెదిరించి లొంగదీసుకోవాలనుకున్నారని, అది సాధ్యమయ్యే పనికాదని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగుకొట్టించడం, వలంటీర్లు, గ్రామ, వార్డు కార్యదర్శులతో నడుపుతామని రకరకాల పేర్లతో వారిని బెదిరించే పనికి దిగారని అన్నారు. చర్చల పేరుతోనూ సమస్యలు పరిష్కరించకుండా బెదిరించారని విమర్శించారు. దొంగలు లూటీ చేసే విధంగా కార్యాలయాల తాళాలు పగుకొట్టించి ఉద్యోగులు, సిబ్బంది మధ్య ఘర్షణ పెట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎవరూ బెదిరిపోరని అన్నారు. సాధికారయాత్ర పేరుతో ఊరూరా తిరుగుతున్నారని, లక్షమంది మహిళల గురించి పట్టించుకోని సిఎం ఏం సాధికారత సాధిస్తారని ప్రశ్నించారు. ప్రజలతో మాట్లాడని సిఎం ఇప్పుడు కొత్తగా ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేసే పని పెట్టుకున్నారని తెలిపారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేలతోపాటు, భవిష్యత్‌లో జరగబోయే ఎన్నికల్లో సీటు ఆశించే వారికి కూడా అంగన్‌వాడీలు తగు హెచ్చరికలివ్వాలని సూచించారు. హైదరాబాద్‌లో కెసిఆర్‌ను పరామర్శిందుకు సమయం ఉన్న సిఎంకు అంగన్‌వాడీలతో గంట సమయం మాట్లాడేందుకు అవకాశం లేకపోవడం బాధాకరమని తెలిపారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 26 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ఏమీ తెలియనట్లు సిఎం వ్యవహరించడం దౌర్భాగ్యమన్నారు. సీట్లు, ఓట్లు, అధికారం, అమ్ముకోవడం తప్ప సిఎంకు మరేమీ పట్టడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శిస్తే ఆర్థిక పరిస్థితి బాగుందని చెబుతున్న ప్రభుత్వం జీతాలు పెంచమంటే మాత్రం బాగోలేదని చెబుతోందని, ఒకేసారి రెండు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ విధానాలపై సోమవారం రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేస్తున్నా అంగన్‌వాడీ మహిళల్లో భయం నిరాశ లేవని పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఫణిరాజు మిగతా 2లో

# కడుపు మండి సమ్మె చేస్తే బ్లాక్‌మెయిలా?

**గిరిపుత్ర**




కడుపు మండిన అంగన్‌వాడీలు తమకు వేతనం పెంచాలనీ, గ్రాట్యుటీ చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో 25 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే దాన్ని 'ఎన్నికల ముందు బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశంతో అంగన్‌వాడీలు సమ్మెకు దిగడం'గా సర్కారువారి దినపత్రిక అభివర్ణించడం దారుణం. వేతనాల పెంపుదల, డిమాండ్ల పరిష్కారం తదితర అంశాల్లో పదేపదే చెప్పిన అబద్ధాలనే జనవరి ఏడవ తేదీన మళ్లీ వల్లె వేసింది. అలాగే మున్సిపల్ వర్కర్స్‌కు హెల్త్ అలవెన్స్‌ను వేతనంతో కలిసి చెల్లిస్తామన్నదే మహా ప్రసాదంలా వర్ణించడం, అన్‌స్కిల్డ్ వారికి స్కిల్డ్ వర్కర్లతో సమాన వేతనం ఇమ్మని యూనియన్ అడిగినట్టు చిత్రించడం ఆ పత్రికకే చెల్లింది.

**అబద్ధాలు గుదిగుచ్చి...**

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఐక్యంగా గడచిన 25 రోజులుగా సమ్మె చేస్తుంటే ఇప్పుడు హఠాత్తుగా దాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటించి వారిపై ప్రభుత్వం ఎస్మాస్త్రాన్ని ప్రయోగించడాన్ని ఆ ఒక్కటి తప్ప దాదాపు అన్ని దినపత్రికలూ తప్పుబట్టాయి. వాటి వైఖరులనుబట్టి పేజీ, పొజిషన్ మారాయేతప్ప అన్నిటి సారాంశం ఒకటే! కానీ ఎస్మాను సమర్థించి, సమ్మెను బ్లాక్‌మెయిల్‌గా అభివర్ణించింది సర్కారువారి పత్రిక మాత్రమే! 'వాస్తవంగా దేశంలో అంగన్‌వాడీలకు ఎక్కువ వేతనాలిచ్చే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉందని' కొండంత అబద్ధాన్ని అవలీలగా వల్లె వేసింది. కానీ నిజం ఏమిటంటే అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి, వారికి వేతనాలిస్తున్నది మన పొరుగునవున్న పాండిచ్చేరి (యానాం)లో. అలాగే నాలుగు నెలలపాటు సుదీర్ఘ సమ్మె చేసిన అంగన్‌వాడీలు హర్యానాలో అత్యధిక గౌరవ వేతనం పొందుతుండగా ఆ తరువాతి స్థానాలు కేరళ, తెలంగాణ రాష్ట్రాలది. ఆ క్రమంలో చూస్తే ఆంధ్రప్రదేశ్ పదవ స్థానంలో ఉంది. ప్రతి దానికీ ఫ్యాక్ట్ చెక్ అని చెప్పేవారు ఈ ఫ్యాక్ట్స్ ఎందుకు చెక్ చేసుకోరు? అలాగే వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం ఏర్పడిన నాటికి రూ. 10,500గా ఉన్న వేతనాన్ని రూ. 11,500కు అంటే కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి, ఎక్కడా లేనివిధంగా సగటు వేతనం అనే లెక్కలు చెప్పి రూ.4,550 పెంచినట్టు అభూత కల్పన సృష్టించింది. ఎవరైనా వేతనం ఎంతనుండి ఎంతకు పెరిగిందని చూస్తారుతప్ప ఇలాంటి తొండి లెక్కలు వెయ్యరు.

అక్కడితో ఆగకుండా '11 డిమాండ్లలో 10 ఆమోదించి అమలుకు చర్యలు చేపట్టిందని' మరో అబద్ధం. వేతన పెంపు, గ్రాట్యుటీ చెల్లింపు డిమాండ్లు అలాగే వుండగా ఒక్కటి మాత్రమే అపరిష్కృతం అన్నట్టు ఎలా రాస్తారు? అంతేగాక కీలకమైన వేతన పెంపు నిరాకరిస్తే చేసిందేమిటి? అలాగే మినీ సెంటర్లన్నిటినీ మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తామని చర్చల్లో అంగీకరించినా ఇప్పటివరకూ జీవో జారీ చెయ్యలేదు. ఇదే అంశంపై తెలంగాణ ప్రభుత్వ కొత్త మంత్రిగా సీతక్క తొలి సంతకం చేసిన తరువాతనైనా ఈ సర్కారు స్పందించలేదు. ఇదేనా అమలుకు చర్యలు చేపట్టడం? ఈ విషయాలన్నీ ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలకు తెలుసు కనుక వారేమీ ప్రభావితం కారు. కానీ అంగన్‌వాడీ సమ్మె న్యాయమైనదని భావించి వారికి అన్నివిధాలా అండదండలిస్తున్న లబ్ధిదార్లను, సామాన్య ప్రజలను తప్పుదారి పట్టించాలన్న ఆ పత్రిక అసలు ఉద్దేశాన్ని అందరూ అర్థం చేసుకోవాలి.

**తిరకాసు వాదనలు**

పారిశుధ్య కార్మికులకు ప్రస్తుతం వేతనంగా రూ.15,000, హెల్త్ అలవెన్సుగా రూ.6,000 విడివిగా చెల్లిస్తుండగా శనివారంనాటి చర్చల్లో ఈ రెంటినీ కలిపి ఒకేసారి రూ.21,000 చెల్లిస్తాం దాంతో పండుగ చేసుకోండి అని మంత్రులు చెబితే అదే గొప్ప వరంలా ఆ పత్రిక రాసింది. వేతనాలు మినహా అన్ని డిమాండ్లు వెంటనే పరిష్కరించి జీవోలు పది రోజుల్లో జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంలోనే తిరకాసు ఉంది. నిజంగా పరిష్కరిస్తే జీవో జారీకి పది రోజులెందుకు? అలాగే సమ్మెలో వేతన డిమాండ్ పరిష్కరించకపోతే ఆ సమ్మెందుకు? అన్నది చిన్నపిల్లవాడు కూడా అడుగుతాడు. ఆమాత్రం తెలియదా ఈ పెద్దలందరికి? తిమ్మిని బమ్మిని చేసే తిరకాసు వాదనలతో ప్రజలను, పాఠకులను తప్పుదారి పట్టించే యత్నాలను ఆ పత్రిక మానుకోవాలి.

## నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న సమ్మెలు, ప్రభుత్వ వైఖరిని చర్చించేందుకు సిపిఎం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీతోపాటు జనసేన, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా, బిఎస్‌పి, వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు హాజరుకానున్నారని తెలిపింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరింది.

## అందుబాటులోకి వైద్య సేవలు

- కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్చామని, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ తెలిపారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 5 లక్షల ఆయుష్మాన్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. 1,672 గ్రామాల్లో ఘర్‌జల్ పథకం కింద సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## నవయుగపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు

- సిల్‌క్యారా టన్నెల్ ప్రమాదంపై ఆర్‌టిఐ సమాధానం

**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లో నిర్మాణంలో ఉన్న సిల్‌క్యారా సొరంగంలో చోటుచేసుకున్న ప్రమాదంలో టన్నెల్‌లో చిక్కుబడిపోయిన 41 మంది కార్మికులు 17 రోజుల పాటు క్షణమొక యుగంలా గడిపి చివరికి సురక్షితంగా బయటపడిన సంగతి తెలిసిందే. ప్రమాదానికి గురైన అండర్‌పాస్ నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ నవయుగపై ఇప్పటి వరకూ కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఐడిసిఎల్) ఇచ్చిన సమాధానం ఇది. ఈ కార్పొరేషన్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉంటుంది. నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ ఈ సొరంగ నిర్మాణాన్ని చేపట్టింది. ఆర్‌టిఐ కింద అజయ్ బోస్ అడిగిన ప్రశ్నకు ఎన్‌హెచ్ఐడిసిఎల్ (బార్‌కోట్) జనరల్ మేనేజర్ కల్నల్ ప్రదీప్ పాటిల్ సమాధానం ఇస్తూ ప్రమాదంపై జరిగిన విచారణకు సంబంధించి నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. విచారణ కమిటీ గత నెల 13-15 తేదీల మధ్య ఘటనా స్థలాన్ని సందర్శించిందని, కమిటీ నివేదికను ఇంకా ప్రచురించలేదని వివరించారు.

మహారాష్ట్రలోని థానే జిల్లాలో నాగపూర్-ముంబయి సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన ప్రమాదంలో 20 మంది కార్మికులు, ఇంజినీర్లు మరణించిన ఘటనను మరువక ముందే మూడు నెలల తర్వాత సిల్‌క్యారా సొరంగంలో ప్రమాదం చోటుచేసుకుంది. దాని ప్రధాన కాంట్రాక్టర్ కూడా నవయుగ సంస్థే. సబ్-కాంట్రాక్టర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.

# హామీలు నెరవేర్చేదాకా ఉద్యమం ఆగదు

- కొనసాగిన అంగన్‌వాడీల దీక్షలు
- పలుచోట్ల 'ఎస్మా' ప్రతుల దగ్ధం
- సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టీకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్-ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో ఆదివారం నిరసన తెలిపారు. జిఒ ప్రతులను దగ్ధం చేశారు. సమ్మెలో భాగంగా కలెక్టరేట్లు, మండల కేంద్రాల్లో దీక్షా శిబిరాలను కొనసాగించారు. వారికి పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. ఎస్మా కాదు... ఎన్ని చట్టాలు ప్రయోగించినా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు.



నెల్లూరులో ఎస్మా జిఒ-2తో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద, తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దీక్షా శిబిరాల వద్ద ఎస్మా జిఒ ప్రతులను దగ్ధం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్ష కొనసాగాయి. కర్నూలు ధర్నా చౌక్‌లో ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. నంద్యాలలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నెల్లూరు ఎస్మా ప్రతులతో నిరసన తెలిపారు. అనంతరం వాటిని దగ్ధం చేశారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో జిఒ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 36 గంటల దీక్ష ప్రారంభించారు. విజయనగరం, పార్వతీపురం కలెక్టరేట్ల వద్ద దీక్షలు కొనసాగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరాల వద్ద ఎస్మా జిఒ ప్రతులను దగ్ధం చేశారు. అనకాపల్లి జిల్లా మునగపాకలో జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. చీడికాడలో మోకాళ్లపై నిల్చొని, అల్లూరి జిల్లా ఎటపాకలో సమ్మె శిబిరంలో ఆటపాటలతో నిరసన తెలిపారు. కాకినాడలోనూ, తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలోనూ ఎస్మా జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కాకినాడలో దీక్షా శిబిరాన్ని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సందర్శించి మాట్లాడారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ధర్నా చౌక్‌లోని అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు సందర్శించి మద్దతు పలికింది. వీరిలో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సురెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జి.కిషోర్ కుమార్ తదితరులు ఉన్నారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని ప్రముఖ న్యాయవాది, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని తక్షణం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య తదితరులు మద్దతు తెలిపారు.


విజయవాడలో ఎస్మా జిఓ ప్రతులను దగ్ధం చేస్తున్న రామకృష్ణ తదితరులు

## ఎస్మా జిఓలు దగ్ధం

- జగన్‌వి అప్రజాస్వామిక చేష్టలన్న నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ కార్మికుల సమ్మెను నిషేధిస్తూ జారీ చేసిన ఎస్మా జిఒను సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఇతర వామపక్ష పార్టీల ఆధ్వర్యాన దగ్ధం చేశారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వాలు వారిపైనే నిర్బంధం ప్రయోగించడం పచ్చి నియంతృత్వమని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలి తప్ప అంగన్‌వాడీలపై బెదిరింపులకు దిగడం ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని అన్నారు. ప్రజలను మోసగించే విధానాలను అనుసరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ఇంట్లో తల్లికి, చెల్లికి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది అక్కచెల్లెమ్మల బాధ ఏమి కనబడుతుందని ప్రశ్నించారు. కేవలం తాను చెప్పింది వినాలనే మూర్ఖత్వంతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని, వీరందరూ రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, నరసింహారావు, న్యూడెమొక్రసీ నాయకులు పొలారి, రవిచంద్ర, ఎంఎల్ పార్టీ నాయకులు జాస్తి కిషోర్‌బాబు తదితరులు మాట్లాడారు.

## ముగిసిన హిస్టరీ కాంగ్రెస్

ప్రజాశక్తి- సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో రెండు రోజులుపాటు తలపెట్టిన ఎపి హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షికోత్సవ సమావేశం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా బుల్లయ్య కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల వేదికగా ఈ సమావేశం నిర్వహించినందుకు ఎపి హిస్టరీ కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పురావాస్తు శాఖ అధికారి ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, ఎపి హిస్టరీ కాంగ్రెస్ ప్రతినిధులు మువ్వ శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ మోజోటి సోమశేఖరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 176 మంది ప్రతినిధులు, 100 మంది చరిత్ర పరిశోధకులు, 70 మంది ఉపాధ్యాయులు హిస్టరీ కాంగ్రెస్‌కు హాజరైనట్టు వెల్లడించారు. బుల్లయ్య కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా కళాశాల విద్యార్థులు తయారు చేసిన 50 బ్యాటరీ సైకిళ్లను కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఆశీలుమెట్ట నుంచి ఆర్‌కె బీచ్ వరకూ సైకిళ్లు తొక్కారు. హిస్టరీ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమంలో బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, 50 మంది బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



హిస్టరీ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మధు కుమార్

# వైసిపిలో కర్ణాటక 'గాలి'

- ఏపిలో టిక్కెట్ల కోసం జనార్ధన్‌రెడ్డి గ్రూపు ఒత్తిళ్లు
- ఇప్పటికే హిందూపురం బరిలో శ్రీరాములు సోదరి శాంత
- తాజాగా కర్నూలు ఎంపీ సీటు ఇవ్వాలని పట్టు
- ఆలూరులో గుమ్మనూరుకు మోకాలడ్డు
- జయరామ్‌కు మద్దతుగా రంగంలోకి డికె శివకుమార్ !


గుమ్మనూరు జయరామ్


గాలి జనార్ధన్ రెడ్డి, జె శాంత, శ్రీరామ్ (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార వైసిపి పార్టీలో కర్ణాటక 'గాలి' సెగలు పుట్టిస్తోంది. మైనింగ్ దిగ్గజం గాలి జనర్ధాన్‌రెడ్డి, ఆయన సన్నిహితులు వాల్మీకి సామాజిక తరగతికి చెందిన మాజీ మంత్రి శ్రీరాములు గ్రూపు నుంచి ఏపిలో టిక్కెట్ల కోసం వైసిపిపై ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి శ్రీరాములు సోదరి జె శాంతను వైసిపి బరిలో నిలిపింది. తాజాగా కర్నూలు పార్లమెంటు స్థానం, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్ల కోసం పట్టు బడుతున్నట్లు సమాచారం.

బళ్లారిలో మెజారిటీగా వున్న వాల్మీకి సామాజిక తరగతికి చెందిన శ్రీరాములు, నాగేంద్ర సహకారాలతో మైనింగ్ దిగ్గజం గాలి జనార్ధన్‌రెడ్డి కర్ణాటక రాజకీయాల్లో ఒకప్పుడు కింగ్‌మేకర్‌గా చక్రం తిప్పారు. అక్రమ మైనింగ్ కేసుల్లో చిక్కుకుని జైలుకు వెళ్లడం, బిజెపి బహిష్కరణ తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆయన ప్రాభవం క్రమేపి తగ్గింది. ప్రస్తుతం ఆయన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష (కెఆర్‌పిపి) పేరిట సొంత పార్టీ నడుపుతున్నారు. అయితే శ్రీరాములు బిజెపిలో కొనసాగుతూనే జనార్ధన్‌కు సన్నిహితంగా మెలుగుతున్నారు. నాగేంద్ర కాంగ్రెస్‌లో చేరారు. 2023లో కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బళ్లారి నుంచి బిజెపి అభ్యర్థిగా శ్రీరాములు, కాంగ్రెస్ అభ్యర్థిగా నాగేంద్ర పోటీ చేసినపుడు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ బళ్లారిలో మకాం వేసి నాగేంద్ర గెలుపు కోసం కృషి చేశారు. ప్రస్తుతం నాగేంద్ర కర్ణాటకలో యువజన సాధికారత, క్రీడల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన విజయానికి కృషి చేసిన గుమ్మనూరుకు ఏపిలో చెక్ పెట్టాలని జనార్ధన్‌రెడ్డి గ్రూపు పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి శాంతకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకున్నారు. అలాగే జయరామ్ రెండు పర్యాయాలు విజయం సాధించిన ఆలూరు నుంచి ఈ దఫా తప్పించాలని వైసిపిపై ఒత్తిడి తెస్తోంది. ఆయన స్థానంలో కురవ సామాజిక తరగతికి చెందిన బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళకు ఇవ్వాలని 'గాలి' గ్రూపు కోరుతోంది. కాగా గుమ్మనూరుతో విభేదిస్తున్న విరుపాక్ష, మాజీ ఎమ్మెల్యే పి నీరజారెడ్డి కుమార్తె హిమవర్షిణి రెడ్డి, తెర్నేకల్ సురేంద్రరెడ్డి కూడా టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఆలూరు టికెట్ ఎవరికి ఇచ్చినా ఫర్వాలేదు గానీ, జయరామ్‌కు మాత్రం ఇవ్వొద్దని వైసిపిని 'గాలి' బృందం గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలిసింది.

అయితే గుమ్మనూరు జయరామ్ కూడా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, తమ బంధువు అయిన మంత్రి బి నాగేంద్ర ద్వారా వైసిపి అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఒకవేళ వైసిపి టికెట్‌ను నిరాకరిస్తే కాంగ్రెస్ నుంచి అయినా పోటీలో నిలిచేందుకు ఆయన కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. సొంత పార్టీ నేతల అసమ్మతితో సతమతమవుతున్న వైసిపికి కర్ణాటక 'గాలి' రాజకీయాలు తలలు పట్టుకునేలా చేస్తున్నాయి.

## అలరించిన గిరిజన నృత్యాలు


ఫొటో : టివి రమణ

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన శంఖారావ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. సమాజంలో ఆదివాసి జీవన ప్రమాణాలు పెరగాలి అనే నినాదంతో నిర్వహించిన ఈ సభలో తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ అశ్మీరా సీతారాం నాయక్ తదితరులు ప్రసంగించారు.

## గిరిజన విద్యార్థి అనుమానాస్పద మృతి

- మరో విద్యార్థి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండల కేంద్రంలో ఆదివారం గిరిజన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మరో విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వెంగడ పంచాయతీ డొంకాయిపుట్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సివేరి రవి (21), పెన్నంటి గ్రామానికి చెందిన మరో విద్యార్థి చొంపి రామన్న కొద్ది రోజులుగా శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో సీతంపేట శివారున నౌదాసరి శేఖర్ కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. పేద కుటుంబాలు కావడంతో గది అద్దెకు తీసుకోకుండా, కోళ్లఫారం షెడ్డులో రాత్రివేళ పనిచేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. పగటిపూట రవి ప్రయివేటు డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నాడు. రామన్న వెటర్నీ కోర్సు చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కోళ్లఫారం యజమాని శేఖర్.. వారిని పిలవగా, స్పందించలేదు. అనుమానంతో ఆయన తలుపుతీసి చూడగా, ఇద్దరూ అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే 108 వాహనంలో వారిని ఎస్ కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రవి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామన్న పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కల్తీ సారా, కోళ్ల మందు బాటిళ్ల ఘటనా స్థలం వద్ద లభ్యమయ్యాయి. పోస్టుమార్టం పూర్తయ్యాక పూర్తివివరాలు తెలుస్తాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని శృంగవరపుకోట ఎస్ఐ లోవరాజు తెలిపారు.

**పోస్టుమార్టం వాయిదా**

రవి, రామన్న కుటుంబ సభ్యులకు కోళ్లఫారం యజమాని వెంటనే సమాచారం ఇచ్చారు. అనంతగిరి జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజుతో కలిసి వారంతా ఎస్ కోట ఆస్పత్రికి చేరుకున్నారు. రవి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాకే పోస్టుమార్టం చేయాలని గంగరాజు డిమాండ్ చేశారు. కోళ్లఫారం యజమాని ఎటూ తేల్చకపోవడంతో ఆదివారం పోస్టుమార్టం చేయకుండా వాయిదా వేశారు.

## నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 13 రోజులుగా సమ్మెలో వున్నా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, తక్షణం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో రెండు పర్యాయాలు చర్చలు జరిపినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. తక్షణం ప్రభుత్వం చర్చలకు పిలిచి మున్సిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగే ధర్నాలో పెద్దయెత్తున మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



## మున్సిపల్ కార్మికుల సమ్మె న్యాయ సమ్మతం

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- సమ్మెకు సంపూర్ణ మద్దతు
- రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాన పనికి సమాన వేతనం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె న్యాయ సమ్మతమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఆదివారం ఉదయం ధర్నా చౌక్లో జరుగుతున్న ధర్నాకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. రూ.వేలకోట్లు అప్పులు చేస్తున్నా.. కార్మికుల వేతనాలు పెంచే విషయంలో ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని ప్రశ్నించారు. కార్మికుల డిమాండ్లు సమంజసమని, అవి పరిష్కారం చేసే వరకూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమ్మె చేయడం ప్రజాస్వామిక హక్కని, హరించేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ప్రస్తుత వేతనాలు ప్రజల జీవన ప్రమాణాలకు అనుగుణంగా లేవన్నారు. కుటుంబాలను పోషించుకోలేకపోవడం వల్లే కార్మికుల్లో పట్టుదల పెరిగిందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. వారి ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటే వారికి వేతనాలు పెంచేందుకు డబ్బులు లేవని చెప్పడం ఏమాత్రమూ సరికాదని అన్నారు. ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థికి రూ.100 కోట్లు ఖర్చు పెట్టడం ఎలా అని ఆలోచించే ముఖ్యమంత్రికి చిరుద్యోగుల వేతనాల పెంపుపై పట్టుదలకు పోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకపోగా పోటీ కార్మికులను పెట్టి పనులు చేయిస్తూ కార్మికుల మధ్య ఘర్షణలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇదే తీరుగా వ్యవహరిస్తే రాబోయే ఎన్నికల్లో వైసిపికి అధికారం పోవడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రాబోయే రెండు, మూడు రోజుల్లో కార్మికులను చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వారికి సంఘీభావం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్, నాయకులు తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 5 ఎమ్మెల్యే, ఒక రాజ్యసభ సీటు కేటాయించాలి

- ఎపి బ్రాహ్మణ సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం 5 ఎమ్మెల్యే, ఒక రాజ్యసభ, మరో ఎమ్మెల్సీ స్థానాన్ని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘాల జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలోని హనుమాన్‌పేటలో రిటైర్డు హైకోర్టు జడ్జి బులుసు శివశంకర్‌రావు అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2019 ఎన్నికల్లో బ్రాహ్మణ అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో తిరిగి అదే సామాజిక తరగతికి ఆయా రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు తిరిగి సీటు కేటాయించాలని, లేని పక్షంలో మరో బ్రాహ్మణ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు కేటాయించొద్దని జెఎసి డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దేవాదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనరు ప్రసాద్‌రావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ద్రోణంరాజు రవి, శర్వాణి మూర్తి, కొప్పరపు బలరామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ లా కమిషన్ రాసిన లేఖపై సిపిఐ(ఎం) 2018 జూలై 4న ఒక నోట్ సమర్పించింది. అందులో వ్యక్తం చేసిన అభిప్రాయానికే మేము ఇప్పటికీ కట్టుబడి ఉన్నాము. అదే పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తోంది. మీ పరిశీలన కోసం ఆ నోట్‌ను ఈ లేఖకు జత చేస్తున్నాము. మా అభిప్రాయం ప్రకారం జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. భారత రాజ్యాంగం ప్రజల అభీష్టానికి సంబంధించిన ప్రాధాన్యతను నిర్వచించింది. అందులో ఏముందంటే... భారతదేశ ప్రజలమైన మేము ఈ రాజ్యాంగాన్ని అంగీకరిస్తున్నాం. దీనికే కట్టుబడి ఉన్నాము. ప్రజలు తాము ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటారు. ఆ ప్రతినిధులు ప్రజలకు, కార్యనిర్వాహక వ్యవస్థ లేదా ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటారు. ఆ ప్రభుత్వం చట్టసభకు జవాబుదారీగా ఉంటుంది. రాజ్యాంగంలోని ఈ కోణాలన్నింటినీ సర్దుబాటు చేయలేము. వాటిని నీరుకార్చలేము' అని సిపిఐ(ఎం) ఆ లేఖలో వివరించింది. జమిలి ఎన్నికల ప్రతిపాదన అప్రజాస్వామికమైనదని, ఫెడరలిజం సూత్రాలను ఉల్లంఘిస్తోందని ఉన్నత స్థాయి కమిటీకి రాసిన లేఖలో సిపిఐ(ఎం) తెలియజేసింది.

## అంగన్‌వాడీలపై ఎస్మా రద్దు చేయకపోతే ప్రభుత్వాన్ని సాగనంపుతారు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ మహిళలు చేస్తున్న పోరాటంలో న్యాయం ఉందని, అందువల్లే ప్రభుత్వాలు ఏమీ చేయలేకపోతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ నిలబడలేదని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రజలతో సంబంధం లేదని పాలన సాగించిన జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం అయ్యారని, ప్రజలు కూడా అతన్ని సాగనంపి ప్యాలెస్‌కు పరిమితం చేస్తారని హెచ్చరించారు. న్యూడెమొక్రసీ నాయకులు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఉద్యమాలను తేలికగా తీసుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేకపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, డి.వి.కృష్ణ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, అనుబంధ సంఘం నాయకులు జె.లలిత, ఐఎఫ్‌టియు నాయకులు పొలారి, రవిచంద్ర, సిఐటియు అనుబంధం అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్.సుప్రజ, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, జైభారత్ పార్టీ నాయకులు పోతిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మావోయిస్టు దారుణ హత్య

- మృతుడు ఎమ్మెల్సీ పోతుల సునీత సోదరుడు

ప్రజాశక్తి తుగ్గలి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్ రైల్వే జంక్షన్‌లో శనివారం రాత్రి మాజీ మావోయిస్టు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పోతుల సునీత సోదరుడు మాజీ మావోయిస్టు పూజారి రాము (59) 1985 నుండి 1991 వరకు నల్లమల ఫారెస్ట్‌లో బోనాసి దళ కమాండర్‌గా పనిచేశారు. ఆర్‌ఎస్‌యు జిల్లా అధ్యక్షులుగానూ ఉన్నారు. ఆయన మానసిక పరిస్థితి సక్రమంగా లేక మతిస్థిమితం కోల్పోయి పెండేకల్ రైల్వే జంక్షన్‌లోనే ఉండేవారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను దారుణంగా హత్య చేశారు. ఈ హత్యపై తుగ్గలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాము తమ్ముడు, ఉద్యమకారుడు పూజారి దినేష్ బాబు మాట్లాడుతూ తమ అన్నను ఎవరో హత్య చేయడం చాలా బాధాకరమన్నారు. ఆదివారం సాయంత్రం సొంతూరు ఆర్‌ఎస్ పెండేకల్లులో అంత్యక్రియలు నిర్వహించారు. వీటికి ఎమ్మెల్సీ పోతుల సునీత ఆమె భర్త సురేష్ హాజరయ్యారు. గతంలోనూ అదే స్థలంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు.

# పేదలను సంఘటితపరచడం కీలకం

వ్యకాస విస్తృత సమావేశంలో వి.శ్రీనివాసరావు పిలుపు



ప్రసంగిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామీణ పేదలను సంఘటితం చేయడంలో వ్యవసాయ కార్మికులు కీలక పాత్ర పోషించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. గ్రామీణ పెత్తందార్లకు వ్యతిరేకంగా రైతులు, కౌలు రైతులు.. గ్రామీణ శ్రామికులతో కలిసి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గుంటూరులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉవ్వెత్తున్న ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఉద్యమంపై నిర్బంధకాండను అమలు చేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వల్ల కార్మికులకు పని దినాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధికి వెసులుబాటుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు, కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ వరకాయలపాటి శివనాగరాణి, గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు ప్రసంగించారు.

### ఎస్మా ప్రయోగిస్తే పతనం ఖాయం : వెంకట్

అంగన్‌వాడీ మహిళలపై ఎస్మా ప్రయోగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తప్పుపట్టారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్మా ప్రయోగం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని తెలిపారు. దేశ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన బిజెపిని, దానికి వంత పాడే పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15 వరకు జనజాగరణ సదస్సులు, 26న దేశ వ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో కార్మికులతో ర్యాలీలు, సదస్సులు, హర్తాళ్, గ్రామీణ బంద్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి లక్షల మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.



# అశ్రునయనాలతో బాలకృష్ణకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

సిపిఎం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నాయకులు, ఎపి కౌలు రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అంగులూరి బాలకృష్ణ (65)కు అశ్రు నయనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు ఆదివారం అంతిమ వీడ్కోలు పలికారు. విశాఖ జగదాంబ జంక్షన్ సమీపంలోని సిపిఎం కార్యాలయం నుంచి ఆంధ్రా మెడికల్ కళాశాలలకు ఆయన భౌతికకాయాన్ని తీసుకెళ్లి అప్పగించారు. అనకాపల్లి పట్టణం గవరపాలెంలోని బోయవీధిలో 1958 జులై ఒకటిన వ్యవసాయ కార్మిక కుటుంబంలో బాలకృష్ణ జన్మించారు. అనేక నిర్బంధాలను ఎదురొడ్డి ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారు. కార్మిక, రైతు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. రైవాడ జలాశయం నీటిని ఆయకట్టు భూములకు ఇవ్వాలని పోరాడారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనను అరెస్టు చేయడంతో కొన్ని రోజులు విశాఖ సెంట్రల్ జైల్లో ఉన్నారు. హైస్కూల్‌లో చదువుతుండగానే గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఎస్ఎఫ్ఐలో చురుగ్గా పనిచేసి, ఆ ప్రాంతంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. ఆ కాలంలో సిపిఎం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యదర్శి దొడ్డి రామునాయుడుతో ఏర్పడిన పరిచయంతో 1982లో సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. 1983లో పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చారు. 1984 నుంచి జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికై సుదీర్ఘకాలం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా కొనసాగారు. ప్రస్తుతం ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆస్పత్రి స్థలం అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడి వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలన్న డిమాండ్‌ను పోరాటం ద్వారా ముందుకుతెచ్చి స్థలం అమ్మకుండా పరిరక్షించగలిగారు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్, పూడిమడక మత్స్యకారులు, ల్యాండ్ పూలింగ్, నల్లబెల్లం నిషేధం సమస్యలపై పోరాడారు. అనకాపల్లి పట్టణంలోని కూరగాయల చిల్లర వర్తకులకు స్థలాలు, షాపులు ఇప్పించారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడారు.


బాలకృష్ణ పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబీకులు, పార్టీ నాయకులు

### పలువురి సంతాపం

బాలకృష్ణ మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, పార్టీ పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి బి.తులసీదాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, గండి నాయినిబాబు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.




షోకాజ్ నోటీసుల ప్రతులను దగ్ధం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

# షోకాజ్ నోటీసులకు భయపడం

- కొనసాగుతున్న సర్వ శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు తేల్చి చెప్పారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 19వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాలను యుటిఎఫ్ నాయకు లు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భం గా జెఎసి నేతలు మాట్లాడుతూ ఈ నెల 5న విజయవాడలో ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి విజయవంతం చేశామన్నారు. అందులో చర్చలు ఫలితంగా ఎవరికి షోకాజ్ నోటీసులు, మెమోలు అందజేయబోమంటూ ఎస్‌పిడి నమ్మబలికి మరు సటి రోజే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నోటీసులు అందజేయడం దుర్మార్గ మన్నారు. విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వ శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద జరిగే సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, విజయనగరం సమ్మె శిబిరాన్ని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి సందర్శించి, సంఘీభావం తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లా, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, నరసరావు పేట, మచిలీపట్నం, విజయవాడ, ఏలూరు, భీమవరం, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, విశాఖ, అనకాపల్లి సమ్మె శిబిరాలలో నిరసనలు కొనసాగాయి.

# పానకాల స్వామికి కిరీటాన్ని సమర్పించిన నారా కుటుంబం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని ప్రముఖ ఆలయాలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌తో కలిసి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి కిరీటం అలంకరించారు. అలాగే చెంచులక్ష్మి అమ్మవారికి, రాజ్యలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఇఒ ఎ రామకోటిరెడ్డి వారికి స్వాగతం పలికారు.


పానకాల లక్ష్మీనరసింహస్వామికి కిరీటం తీసుకెళ్తున్న నారా కుటుంబం

# రేపటిలోగా మెగా డిఎస్‌సి

- లేదంటే సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి ప్రకటించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం లోపు ప్రకటించకుంటే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న హెచ్చరించారు. విజయవాడలోని బాలోత్సవ భవనంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా డిఎస్‌సి అంటూ నిరుద్యోగులను నయవంచన చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 1.69 లక్షలు మాత్రమే ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని చెప్పారు. దాదాపు 18,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇవి కాకుండా ఈ నెల చివరి నాటికి మరో 5 వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారని తెలిపారు. 117 జిఓ పేరుతో మరో 10 వేల ఉపాధ్యాయ పోస్టులను, తెలుగు మీడియం పేరుతో మరో 15 వేల పోస్టులను రద్దు చేసిందని వివరించారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2 వేల పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 9 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని వివరించారు. వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నా.. ప్రభుత్వం లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు డ్రాపౌట్లు కావడం లేదా? అని ప్రశ్నించారు. వీరంతా ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని, రెండేళ్లలో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం-2020ను రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహించారు. తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ విధానం

- వైద్యుల సదస్సులో మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైద్య ఆరోగ్యశాఖలో జీరో వెకెన్సీ విధానంతో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రభుత్వ వైదులతో ఆదివారం ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి విడదల రజని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యులకు ఉద్యోన్నతులు ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. వైద్యుల వేతనాలను కూడా గణనీయంగా పెంచినట్లుతెలిపారు. ప్రభుత్వ వైద్యుల ప్రైవేటు ప్రాక్టీసుకు అనుమతులు ఇవ్వడం, వైద్యుల రక్షణ కోసం చట్టాలు తీసుకురావడం, ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అడిషనల్ డిఎంఇ ప్రమోషన్లు ఇచ్చామని తెలిపారు. ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా జీరో వేకెన్సీ విధానంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. 53 వేల పోస్టులు భర్తీ చేసి జగన్ రికార్డు సృష్టించారన్నారు. రోగులు, ప్రజల అవసరాలను బట్టి కొత్తగా నెఫ్రాలజీ వార్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ట్రైబల్ ప్రాంతాల్లో నియామకాలు చేపట్టి అక్కడి ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు పొందేలా చేశామన్నారు. వ్యాధుల బారినపడకుండా ప్రజలకు ప్రివెంటివ్ మెడికల్ కేర్ ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా పేదల ఇళ్లకే వైద్యులు వెళ్లి ఉచితంగా వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు.




यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank
NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST
డిమాండ్ నోటీసు
[illegible]
తేది : 28-12-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



'మనం కాలాన్ని కొలువ గలిగింది మార్పుతోనూ, నూతనానుభవాల తోనూ మాత్రమే! అప్పుడే మనకు అంటే మనం జీవించిన మన కాలానికి అర్థం... పరమార్థం!'. - కొడవటిగంటి



## మనుషులు ఓడిపోయే నేల

క్రూరమైన అంటువ్యాధిలా యుద్ధ శంఖారావం
ఒక యిరుకు నేలను కబళిస్తున్నప్పుడు
హింసల డోలు మీద నెత్తుటి మోతలతో
పర్వతాలు లోయలు సముద్రాలు..
ఇల్లు ఆసుపత్రులు బడులు..
చుట్టూతా చావు ప్రతిధ్వనిస్తున్నప్పుడు
యుద్ధ విమానాల రెక్కల కిందనుండి
కన్నీటి పోగుల మీద బాంబుల పొగలు కమ్మి
దిగులుతోటల బతుకు శిథిలాల చుట్టూ
మంటల్లో తగలబడుతున్న పంటచేలలా
చెల్లాచెదురు ప్రాణాలు కొడిగడుతున్నప్పుడు
ఏ చిన్న శాంతి ప్రతిపాదనకూ
ధూసరగాలి ఊపిరాడనివ్వనపుడు
ప్రతి ఉదయం శవాల వెలికితీతకే
సూర్యుడక్కడ ఉదయిస్తున్నాడేమో!

ఇళ్ల పైకప్పులన్నింటిని మృత్యుగాలి ఎగరగొట్టేసినప్పుడు
బంధాల సమాధుల మీద పాశాల బుగ్గిరేగుతున్నపుడు
లేతబుగ్గల మీద మెరిసే చిరునవ్వుల్ని చిదిమేస్తూ
బంకర్లలో పార్కుల్లో పిల్లల ఆట స్థలాల్లో
సాలీళ్ళు గూళ్ళు కట్టుకుంటున్నప్పుడు
కొన ఊపిరి ఆశలు కూడా అలసిపోయి
చెట్లకొమ్మల్లో పళ్ళు కన్నీరవుతుండగానే
లేతచిగుళ్ళు ఒక్కొక్కటి నేల రాలిపోతున్నప్పుడు
వాటి దురదష్టానికి గుండె కరగకపోగా,
పొద్దస్తమానం సిగ్గు దాచుకోవడానికే
నిద్ర నటిస్తున్నావేమో నికృష్ట ప్రపంచమా!

భయము ఆకలి రోగము
ముగ్గురు సెంట్రీల పహారాలో
నిరాయుధులంతా ఉన్మాదుల కట్టుబానిసలై
మత్యువే వారికి ఆఖరి యజమానిగా మిగిలినప్పుడు
ఇంకా చావుకు చిక్కనివాళ్ళ కోసం ఆసుపత్రులన్నీ
శవాగారాలుగా మారిపోయినప్పుడు
హంతకముఠాలు జొరబడిన పవిత్ర భూమిలో
నెత్తుటి అంగాలు విరగ పండుతున్నప్పుడు
మనుషులు ఓడిపోయే ఓ ఆయుధాల నేలా!
ఆయుధాలను గెలవనిచ్చే ఓ అనైక్య రాజ్యాల సమితీ!
నిశ్చింతగా కళ్ళు మూసుకో,
నిద్రలోనే చచ్చిపో! నిద్రలోనే చచ్చిపో!

– కంచరాన భుజంగరావు



## ఒక పక్షిలా ...

ఓ రైతు, పొలంలో పక్షులను
పొద్దుటినుంచీ తరిమితరిమి అలసిపోయాడు
అవి అటు చెరుకుతోటలోకి
ఇటు వరిపొలంలోకి పదేపదే వాలుతున్నాయి

అతనంటాడు :
పక్షికి అతివాదం నచ్చదు
అధికారం నచ్చదు
వినాశనాన్ని సమర్ధించదు
కేవలం స్వేచ్ఛ కోరుకుంటుంది స్వేచ్ఛ

మన జీవితం ఎక్కడో వ్యాపారం అయిపోయింది
ఏదీ సహజంగా మాగి రాలడంలేదు
సుఖం అర్థమయినంత సులభంగా
ప్రజలు అర్థం కాలేదు
చెట్లుకోసేస్తే బోసిపోయిన ప్రాంతంలో ఏర్పడే శూన్యంలా
ప్రతిచోటా పొడి నగ్నత్వం
అనంటాడు...

ఇన్ని సవాళ్ళ మధ్యా,
పంటకోతకు కొన్ని ఆరు తడుల దూరమే ఉందని
కేవలం లేగదూడ పేయైతే చాలని తృప్తిపడుతున్నాడు
చిన్నచిన్న విషయాలకు చింతలకండు వాకాక
దానిని గాలిలో విదిలిస్తున్నాడు రైతు, పక్షిలాగా!

– శాంతయోగి యోగానంద
91107 70545



## గమ్యమొక్కటే!

చీకటి లోయలో కాకుల గుంపు
చిరాకు పడుతూనే ఉంది
చికాకు పెడుతూనే ఉంది..
నీ వల్ల కానే కాదంటూ,
నడక వీల్లేదంటూ.
బురద మడుగులో మొసళ్ల జంట,
పొదల్లో చేరిన తోడేళ్ళ మంద
నొసలు చిట్లిస్తున్నాయి
కన్నీళ్లతో నస పెడుతున్నాయి..
ముందుకెళ్లడం ముప్పేనంటూ,
క్షమించరాని తప్పేనంటూ ...

ముందు నిలిచిన గమ్యమొక్కటే
రారమ్మని పిలుస్తోంది
భుజం తట్టి వెల్తురు పరుస్తోంది
మిత్రమా,
నీ యాత్ర నువ్వే చెయ్యాలంటూ..
నీ చరిత్ర నువ్వే రాయాలంటూ ...

– డా. డి వి జి శంకరరావు, మాజీ ఎంపీ,
94408 36931

# పాపిట్లో సింధూరం మణిబాబు కవిత్వం

సమీక్ష

A poem should be wordless As the flight of birds — Archibald MacLeish..

మణిబాబు కవిత్వం చదువుతుంటే చాలా సందర్భాల్లో పైన చెప్పిన పంక్తులు గుర్తొచ్చాయ్. తన ఇరవయ్యో ఏటనుండే కవిత్వ సాధన చేస్తున్న మణిబాబు ఇటు చేయి తిరిగిన కవే కాదు, అటు నోరు తిరిగిన మంచి వక్త కూడా. అందుకు అతను గతంలో ముద్రించిన మూడు కవిత్వ పుస్తకాలు, అయిదు సాహిత్య వ్యాస సంపుటాలు సాక్ష్యమిస్తున్నాయి. శేషేంద్ర, వరవరరావుల తర్వాత "నేనిలా – తానలా" అంటూ సముద్రంతో సంభాషించాడు, మణిబాబు. సముద్రతీర వాసి కదా! ఇపుడు, నాలుగో కవితా సంపుటి 'నింగికి దూరంగా ... నేలకు దగ్గరగా' శీర్షికే చెబుతోంది, కవి ఏమిటో. కృష్ణశాస్త్రి గారి కృష్ణ పక్షపు పక్షాలను ఈ వాక్యాలు తిరగేసి తొడుక్కున్నట్టు లేవూ?.

నేలకు దగ్గరగా ... కదా అంటున్నాడు. నేలంటే గురజాడ అన్నట్టు దేశమంటే మట్టి కాదోయ్ మనుషులు కదా! నేలను ఆవరించివున్న, అంటిపెట్టుకుని వున్న సమస్త ప్రకృతి, జంతుజాలమూ, అందులోని మనుషులూ, వారి ఆనందాలు, విషాదాలు అన్నీ అన్నీ ఈ కవితల్లో పొరలు పొరలుగా దర్శనమిస్తాయి. మనం చేయవలసిందల్లా ఆ పొరలను విప్పి చూడడమే!

మణిబాబు కవిత్వంలో వస్తువరణం చాలా విశాలమైనప్పటికీ నన్ను ఆకర్షించిన రెండు ప్రధాన అంశాలు పిల్లలు, స్త్రీలు. వీటికి సంబంధించిన కవితలు చదువుకుంటున్నపుడు మణిబాబు కవిత్వంలో నన్ను నేను చూసుకున్నాను. వైద్యుల్లో పిల్లల వైద్యులు వున్నట్టు కవుల్లో పిల్లల కవులు కూడా వుంటారనుకుంటాను. శ్రీశ్రీ, ఇస్మాయిల్, శిఖామణిల తర్వాత పిల్లల మీద మంచి కవితలు రాసిన కవి మణిబాబు ఒక్కడే! తండ్రి–కూతుళ్ళ కేంద్రంగా 2018లో నాన్న– పాప పేరుతో కవితాసంపుటి వెలువరించాడు. సొంత పిల్లలైనా, ఎదుటివారి పిల్లలైనా పిల్లలపై కవిత్వం రాయడానికి కవి ముందు తానూ పిల్లాడైపోవాలి. పిల్లల్లో పరకాయ ప్రవేశం చెయ్యాలి. లేకపోతే వాక్యం పలకదు. మణిబాబు పిల్లల కవి అని ఈ సంపుటిలో ఉన్న అరడజనుకు పైగా వున్న పద్యాలు చెబుతాయి. 'జ్వరం' కవితలో మనకు జ్వరం వస్తే మనం చేయాల్సిన పనులు ఇతరులు చేస్తారు. మరి పాపకు జ్వరం వస్తే పాప ఆడుకునే ఆటలు ఎవరు ఆడి పెడతారు? "కాస్త తగ్గగానే /ఆటలన్నీ ఓపిక చేసుకుని/ ఒక్కత్తే ఆడుకుంది"ఈ మాటలు అనడానికి ఒక తండ్రి తనమే సరిపోదు. మొత్తం బాల్యం మీద ఒక అవ్యాజమైన వాత్సల్యం, అనురాగం వుంటేనే సాధ్యపడు తుంది.

మనకు రెండు రకాల అస్తిత్వాలుంటాయి. మన తాత దండ్రుల అస్తిత్వాలు చెప్పుకోవడం ఒకటి, పిల్లల అస్తిత్వాలను




ఆమోదించడం రెండు. మా అమ్మాయి నందిని పుట్టాక, సి.నారాయణరెడ్డి గారిని కలిస్తే, అంతకుముందు అడిగినట్లు యూనివర్సిటీ ఎలా వుంది? నీ ఉద్యోగం ఎలా వుంది? అని కాక, నందిని ఎలా వుంది? ఏం చదువుతోంది, కవిత్వం చదువుతుందా? అని అడిగేవారు. ఇదంతా పిల్లల చుట్టూ అల్లుకున్న సైకాలజీ. మణిబాబు 'కృతి వాళ్ళ డాడీ' కవిత రాశాడు. ఇదివరకు ఒక్క పోస్ట్ మెన్‌కే తెలిసిన ఆయన ఇపుడు కూతురు కృతి పుట్టడం వలన, ఆమె స్నేహితుల వలన 'కృతి వాళ్ళ డాడీ ఇల్లు' అంటే చెబుతారంట. ఎంత గడుసువాడు ఈ కవి! నాకు ఇలాంటి అనుభవమే వుంది. కాకపోతే పాపతో కాదు, చెట్టుతో. 'నల్లగేటు నందివర్ధనం చెట్టు' అని ఒక కవిత రాస్తే, మిత్రులు గరికపాటి నరసింహారావు గారు తన విశాఖ ప్రవచనంలో 'కృష్ణుడు నారదుడికి పారిజాత పువ్వు వుండే చోటు గుర్తులు చెబుతూ, శిఖామణి తన ఇల్లు నందివర్ధనం చెట్టు దగ్గర' అన్నట్టు చెప్పారట. పాపకైనా, చెట్టుకైనా ఇంతకంటే అస్తిత్వం ఏం కావాలి! అసలు మీకు ఒకటి తెలుసా! తమిళనాడుల్లో పక్కింటివాళ్ళు పిల్లల తల్లులను, వాళ్ళ సొంతపేర్లు పెట్టి పిలవరు. పిల్లల పేర్లకు 'అమ్మ'ను జోడించి పిలుస్తారు. ఇపుడు కృతి వాళ్ళమ్మను పిలవాలంటే 'కతమ్మ' అనే పిలుస్తారు. ఇపుడు ఈ కవిత 'కృతమ్మ' అయిపోయింది.

ఇలాగే, బహుశా కార్తీక మాసంలో కోనేటిలో వొదిలిన దీపం చుట్టూ పాప తిరుగుతుంటే, పాప వెనకాలే తిరుగుతున్న తండ్రి 'నా దీపం ఎటు వెళ్తోందో / నేనూ చూసుకోవాలిగా' అన్నప్పుడు, దీపం కోనేటిలోనే కాదు మన గుండె చెరువులోనే వదిలినట్టవు తుంది.

ఇక, స్త్రీల కవిత్వం. తెలుగు సాహిత్యంలోకి స్త్రీవాదం ప్రవేశించినప్పుడు 'ఆకాశంలో సగం' అనే మాట బహుళ ప్రాచుర్యం పొందింది. అలాంటి సగభాగానికి అందవలసిన, చెందవలసిన హక్కులు, స్వేచ్ఛ లభించడం లేదని ఉద్యమ సారాంశం. అయితే, సున్నిత మనస్కుడైన ఈ కవి 'నువ్వు ఆకాశంలో సగమంటే / నే నొప్పుకోలేను మన్నించు' అంటాడు. ఆమెలోని అనేక అవస్థలకు ఆకృతిని ఇస్తూ, భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం – ఈ పంచభూతాలకు ఆమెను ప్రతినిధిగా చూస్తాడు. ఇది Poetic Justice వరకు బాగానే ఉంటుంది గానీ, ఈ ఉదాత్తభావనను అందుకోడానికి నేలబారు ఆటవిక పితృస్వామ్య సమాజం తనను తాను ఎంతవరకూ సంస్కరించుకోవాలి. "మనో విస్తృతిని పొందాలి' అని కవి చేసిన సూచన మగ సమాజం అంతటికీ వర్తిస్తుంది.

అలాగే, 'మూడు కాలాలు' కవితలో, అమ్మ ద్వారా గతాన్ని, భార్య ద్వారా వర్తమానాన్ని తెలుసుకుని, పాప ద్వారా భవిష్యత్తును కలగంటున్నాను అనడం వ్యక్తిగతం అనిపించినప్పటికీ – కుటుంబం, సమాజం నిర్మాణంలో వివిధ దశల్లో స్త్రీ పోషించే పరిణామాలకు ఈ వాక్యాలు సాక్ష్యాలు. ఆసుపత్రిలో నర్సుల సేవాత్యాగ నిరతికి అద్దం పట్టే కవిత 'దయా రూపేణ సంస్థితా'. ఈ కవిత చదువుతుంటే నా 'ప్రమిద కింద చీకటి' కవిత లీలగా గోచరించింది.

ఇంత రాసిన కవి కవిత్వం గురించి కవిత్వం రాయకుండా ఎలా ఉండగలడు? "నేస్తం ఓ కవిత రాయవూ! అని కవి మిత్రుణ్ణి అడుగుతున్నాడు. ఆ తర్వాత ఎలా రాయకూడదో, ఎలా రాయాలో విధి నిషేధాలను విధిస్తున్నాడు.

"ఆఫీసర్ ఎదుట మొహమాటంగా కూర్చుని/ భయపడుతూ కాఫీ తాగుతున్నట్టు కాదు/ అర్ధరాత్రి దాహంతో మెలకువ వచ్చి/ గొంతులో గటగటా నీళ్ళు వొంపుకున్నట్టు రాయి' అంటాడు. కవిత్వం ఒక అసంకల్పిత చర్య అని చెప్పకనే చెబుతున్నాడు. దీన్నే శ్రీశ్రీ 'కవిత్వమొక తీరని దాహం' అని మరొకలా చెప్పాడనుకుంటాను. అక్షరం కవితలో అక్షరానికి, సారస్వతానికి వున్న అవినాభావ సంబంధాన్ని అనేక పోలికల్లో చెబుతూ, ఒకచోట 'అక్షరమొక ఆయుధం/ సారస్వతమొక సైన్యం' అంటాడు. సాహిత్యం యొక్క అంతస్సూత్రాన్ని, అంతిమ లక్ష్యాన్నీ ఈ వాక్యాలు నిర్దేశిస్తున్నాయి.

కవిత్వ నిర్మాణం, కూర్పు గురించి అనాదిగా ఎన్నో నిర్వచనాలు, వ్యాఖ్యానాలు వచ్చాయి, వస్తున్నాయి. అది నిరంతర ప్రవాహం. 'భార్య అడిగింది : కళ్ళు ఎర్రగా వున్నాయి, రాత్రంతా మేలుకుని కవిత్వం రాసుకున్నారా!' అని. భర్త అన్నాడు : "వేలాది పదాల నుండి నాలుగు కవితా వాక్యాలను ఏరుకోవడం అంత సులువనుకున్నావా?" అని. ఆమె "మందంగా తొరక కట్టిన పాలగిన్నె నుండి నెమ్మదిగా ఊదుతూ ఊదుతూ ఒక్కో చుక్కా డికాక్షన్‌లో పోస్తూ ... ఇలాగే కదూ" అంది. గహనమైన, రహస్యమైన కవితా నిర్మాణాన్ని వంటింటి కాఫీ తయారీతో పోల్చిచెప్పడం ... రెండూ తేలిక కాదు. Right words in Right place కూచోకపోయినా, డికాషన్, పాలు సమపాళ్ళలో కుదరకపోయినా అటు కవిత్వమూ, ఇటు కాఫీ రెండూ ఆభాసుపాలవుతాయని చెప్పడమే కదా ఇది! కాసేపు మధ్యాహ్నపు నిద్ర మంచిదనీ, ఉద్యోగస్థులకైతే కొత్త ఉత్తేజాన్నిస్తుందని పరిశోధనలు రుజువు చేశాయి. మణిబాబు ఈ అంశంపై 'కునుకు' కవిత రాసాడు. 'మధ్యాహ్నపు నిద్రంటే దాటిన దూరానికి, చేరాల్సిన తీరానికి మధ్య విరామం' అంటాడు. శివారెడ్డి ఈ అంశంపై 'ఆమె ఎవరైతేనేం' అనే గొప్ప కవిత రాసాడు.

గ్రామీణ బాల్యం నుంచి వచ్చిన వారెవరికైనా పాలఐస్, డ్రింకుల బండి వంటివి మధురమైన జ్ఞాపకాలు. 'ఇంద్రధనస్సుని సీసాలలో నింపి అతడు బండిని దొర్లించుకు పోతాడు' అంటాడు డ్రింకుల బండి కవితలో. బడిలో మేస్టార్లు చెప్పే పాఠాల కంటే వేసవి చీమచింత, మామిడి, ముంజెలు, చెరుకుగడ, ఐస్ పుల్ల జీవితానికి సరిపడా పాఠాలు చెప్పాయని 'సెలవు పాఠాలు' కవితలో విశ్లేషిస్తాడు. 'పుస్తకాలు సర్దడం' గురించి 'గూడు సర్దడం' అనే మంచి కవిత రాశాడు. 'దోబూచులాట' కవిత వెలుగు నీడలతో సంభాషించిన తాత్విక కవిత. వెలుగు నీడలు మాట్లాడ్డం వింటుంటే మనసులో 'ప్రబోధ చంద్రోదయం' మెదిలింది.

వీటితోపాటు అద్దేపల్లి రామమోహనరావు, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి దంపతులు – వంటి సాహితీవ్యక్తుల, వ్యక్తిత్వాలపై రాసిన కవితలూ మనల్ని పలకరిస్తాయి. వీటన్నిటి కంటే కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి మొదట్లో 'ఆంధ్రపురాణం' రాసిన మహావక్షం నేలకొరిగినపుడు రాసిన 'వంద అడుగుల వ్యాసపీఠం' కవిత చాలా గొప్పది. ఉస్మానియా ఆసుపత్రిలో చింతచెట్టు, పాలమూరు 'పిల్లల మర్రి' వంటి వృక్షాలు చరిత్ర ప్రసిద్ధి చెందినవి. ఆ కోవలోకి చెందినది ఆంధ్రపురాణ సహకార వృక్షం. దాన్ని మణిబాబు ఈ కవితలో మానవీకరించారు (personification). 'వంద అడుగుల వ్యాసపీఠం' అనే పదబంధం ఆ చెట్టు విస్తృతిని, వైశాల్యాన్ని దృశ్యమానం చేసింది. ఇన్ని విషయాలు తెలిసిన కవి సంగీతం అంటే చెవి కోసుకోకుండా వుండగలడా! 'సంగీత యానం' కవిత చదవండి. కవి లోపల వున్న నారద తుంబురులు, వీణ చిట్టిబాబులు, ఫిడేలు నాయుడు గార్లు కచేరీలు వినిపిస్తారు. ఇవన్నీ చదివాక ఈ కవిత్వం 'కవితా సతి పాపిట ఎర్రెర్రని సిందూరం' కదా అని అనుకోకుండా వుండలేం. గురువు గారూ! అని పిలిచే తమ్ముడు మణిబాబుకు ఆశీరభినందన.

– శిఖామణి
98482 02526

(అవధానుల మణిబాబు కవితా సంపుటి 'నింగికి దూరంగా నేలకు దగ్గరగా...'కి రాసిన ముందుమాట)

# బాధితుల పక్షాన బాధ్యతాయుత స్వరం

పుస్తకం

మహాకవి శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం కావ్యానికి గుడిపాటి వెంకట చలం 'యోగ్యతాపత్రం' రాశారు. అందులో ఒకచోట 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధంతా శ్రీశ్రీ బాధ' అని వ్యాఖ్యానించారు. ఇలా ప్రపంచపు బాధను తమ బాధగా పరిగణించే కవుల్లో ముందు వరుసలో ఉండే కవి సరికొండ నరసింహరాజు.

చిన్న వయసులోనే తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక పేజీని, ఇమేజిని లిఖించుకున్నారు ఆయన. ఇప్పటివరకు 10 కవితా సంపుటాలను అచ్చు వేయించి అనేక అవార్డులు పొందారు. రెండు రాష్ట్రాల్లోనూ వివిధ ప్రాంతాల్లో జరిగే సాహిత్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరికీ తలలో నాలుకలా వ్యవహరిస్తారు. ఆయన తాజాగా 'నెత్తుటి పాదాలు' పేరిట కవితా సంపుటిఇ వెలువరించారు. కరోనా సమయంలో వలస కూలీలు పడిన బాధలకు చలించి రాసిన కవితలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి.

మొట్టమొదటిగా 'ఊపిరి ఆడటం లేదు' అనే కరోనాత్మక, కరుణాత్మక కవితలో కొన్ని పాదాలు ఉటంకిస్తాను. మనిషికి ఒకసారి ఊపిరాడకపోతేనే ప్రాణం తిరిగి రాకుండా ఎటో పోతుంది. వర్తమాన జీవన చిత్రంలో మనిషి ఎదుర్కొంటున్న జీవిత సంఘర్షణలలో ప్రతిక్షణం ఊపిరి ఆడని పరిస్థితులు ఉన్నాయనే ఉద్దేశంతో రాసిన అద్భుత కవనం ఇది.

"గడ్డ కట్టిన కన్నీటి కాలంలో/ ఊపిరి ఆడటం లేదు/ తెగిపడ్డ మానవ సంబంధాల నడుమ/ ఊపిరి ఆడటం లేదు దుఃఖం పొలమారి/ ఊపిరి ఆడటం లేదు/ గొంతులో వర్ణ వివక్ష గళం అడ్డుపడి/ ఊపిరి ఆడటం లేదు అధికారం అణచివేతల/ గానుగలో పిప్పై ఊపిరి ఆడటం లేదు/ కనిపించని ఉరితాడుకు వేలాడుతూ / బడుగు జీవికి పేదరికపు వధ్య శిలపై ఊపిరి ఆడటం లేదు" ఎన్ని రకాల భావచిత్రాలను ఇందులో పొదిగారో చూస్తేనే ఆయనకు భాషపై ఉన్న పట్టును, అణగారిన ప్రజల పట్ల సహానుభూతి సానుభూతిని మనం అంచనా వేయొచ్చు.

కరోనా వైరాగ్యం అనే మరో కవితలో 'చెట్టుతో మాట్లాడుతున్న/ పిట్టతో మాట్లాడుతున్న/ కడగండ్లతో మాట్లాడుతున్న/ కన్నీళ్ళతో మాట్లాడుతున్న/ మట్టితో మాట్లాడుతున్న/ మౌనంతో మాట్లాడుతున్న/ కరోనాకాలం కదా ఇది/ మాట్లాడే మనుషులే లేరు/ ఈ బధిర లోకంలో/ బతుకుతో పోట్లాడుతున్న..." అన్నారు. కరోనా కోర ఘోర పిశాచికి ప్రాణ భయకంపితులై ప్రజలు పడిన పాట్లు, అగచాట్లు, రోదన మనకందరికీ స్వానుభవమే. ఆసుపత్రుల్లో, ఇంట్లోనూ ఏకాంతంగా గదుల్లో ఎవరికి ఎవరో, చివరకి మిగిలేది ఎవరో అనే ఆవేదనతో, ఆందోళనతో గడిపిన జీవనం మనకు మరచిపోలేని భయంకర అనుభవాలను మిగిల్చింది. మాట్లాడటానికి మనిషి లేని కరోనా కాలంలో పడిన మానసిక వ్యధ ఈ కవితలో పద చిత్రాలలో కనిపిస్తుంది. 'మరో చీకటి రాత్రి' అనే కవితలో 2020 మేలో ఎల్జి పాలిమర్స్ కంపెనీలో జరిగిన ఒక ప్రమాదం గురించి ప్రస్తావించారు. గాలి పీల్చుకోవటానికి కూడా సామాన్య ప్రజలు పడే అగచాట్లను, రోడ్లపైనే కుప్పకూలిపోయిన




హృదయ విదారకమైన దశ్యాలను ప్రభావశీలంగా వివరించారు.

"మరో భోపాల్ నా విశాఖ/ ఓ ముగింపు లేని స్మృతి గీతం/ విషపు చెట్టుకు విషాదం/ శాఖోప శాఖలుగా విస్తరించినట్లు/ కాలుష్య సముద్రంలో కలిసిన/ ఆవేదనల కన్నీటి జన సముద్రం/ ఎడతెగని దు:ఖ తీరాన/ చచ్చిన ఉప్పు చేపలు/ చెల్లాచెదురుగా పడినట్లు/ మరణం వలవేసిన/ తెంపులేని చీకటి రాత్రి/ తెంపిన పేదల ఊపిరి దారాలు..." అంటూ విషాద రాత్రిని వివరించారు. మరణాన్ని వల తోనూ, పేదల ప్రాణాలను పుటుక్కున తెగే దారాలతోనూ పోల్చి చక్కని ఉపమానాలతో ఈ కవితను చిరస్థాయిగా నిలిపారు. లాభాల సముపార్జనే ధ్యేయంగా ఉండే, కార్మికుల కండలను పిండే కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యం, ప్రభుత్వ నిర్లిప్తత, అధికారుల నిద్రాణ స్థితి అన్ని కలగలసి ఎన్నో పేద ప్రజల ప్రాణాలను తీశాయి.

"నేనే" అనే మరొక కవితలో కవన కదనరంగంలో తన విశ్వరూపాన్ని కవితాక్షరాలను శరాలుగా మార్చి తన మార్కు కవిత్వాన్ని రుచి చూపిస్తారు. "కలల మధ్య పడేయండి/ కావ్యమౌతాను / వెదురు తోటలో పడేయండి/ వేణువునౌతాను/ కొలిమిలో పడేయండి/ ఆయుధమౌతాను/ బోనులో బంధించండి/ సింహగర్జనౌతాను/ నేలలో పాతేయండి/ చెట్టునౌతాను/ సముద్రంలో ముంచండి/ ముత్యమవుతాను/ ఆకాశంలోకి విసిరేయండి/ సూర్యబింబం అవుతాను" అన్నారు. ఇది కదా కవిత అంటే. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నేను నాలాగే ఉంటాను నేను నేనే అని నిక్కచ్చిగా ప్రకటిస్తూ నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే నిబిడాశ్చర్యంలో మీరంతా ఉంటారని నిశ్చయంగా చెప్తున్నాడు.

ఈ సంపుటిలో కవిత్వమంతా మనిషి తత్వాన్ని నిలబెట్టడానికే రాసిన కవిత్వం. అసలు మనుషులను పోల్చడానికి ప్రకృతిలో లభ్యమయ్యే వస్తువులను మించి ఎక్కడ దొరుకుతాయి. మానవ సంబంధాలను నిలుపుకోవడానికి ప్రయత్నం చేయాలంటే మన చుట్టూ కోకొల్లలుగా కనిపించే ఉదాహరణలను గమనించాలి. వెలక్కాయల ఉపరితలం గట్టిగా, లోపల మెత్తటి గుజ్జు ఉంటుంది. మనుషులు కూడా కొంతమంది బయట కరకుగా కనిపించినా లోపల మంచితనం, మానవత్వం అనే గుజ్జు ఎంతో ఉంటుంది. ఆ గుజ్జు వరకు తీసుకొని ఆనందించాలి. అదే విధంగా మనిషిని ఒక చెరుకుగడలా కూడా పోల్చవచ్చు. బయట కొరుకుడు పడని తత్వంతో ఉన్నా కొంచెం కొంచెం ఆస్వాదిస్తుంటే ఆ మాధుర్యమే వేరు. మనం వారిలోని చెరుకు రసం లాంటి ప్రేమను గ్రోలి అవసరం లేని పిప్పిని వదియాలి. అంతేగాని బయట పొర అడ్డుగా ఉంది కాబట్టి పారేసి వస్తానంటే ఉపయోగం లేదు. కుల మత ప్రాంత జాతులకు అతీతంగా ఈ ప్రపంచాన్నంతా ప్రేమమయం చేయటమే ఈ కవిత్వం సారాంశమని అర్థమవుతుంది.

"ఆఖరి మజిలీ అమ్మ" కవితలో... "చందమామ రావే.. జాబిల్లి రావే../ అని లాలించిన చేతులు/ శవాలను చంకనెత్తుకుంటున్నాయ్/ కన్నతల్లై కన్నీటి లాల పోస్తున్నాయ్/ అనాథ శవాలకు సైతం దహనసంస్కారం నిర్వర్తించే అనుంగు బిడ ఆమె!/ పతాక శీర్షిక లెక్కని ఉత్తమ సంఘ సంస్కర్త!/ చితికిన చీకటి బతుకుల చితిమంటల సాక్షిగా.../ కాటికాపరి బాధ్యతల్ని శవాల బంధాన్ని భుజానికెత్తుకుంది!/ బతుకు కడగండ్ల పడగ మీద/ మణి అందుకుందేమో/ అందుకే కాటికాపరి మణెమ్మ ఐంది!" అంటూ నల్లగొండ జిల్లా గరిడేపల్లిలో మహిళా కాటికాపరి వృత్తి నిర్వహించే మణెమ్మ గురించి హృదయం ద్రవించేలా రాశారు. "ఆకలి మాట్లాడితే..." కవితలో రూపకాలంకారాలతో ఒక విశ్వరూపం కనపడుతుంది. "ఆకలి మాట్లాడితే/ గుక్కపట్టే పిల్లాడికి సేపిన తల్లి రొమ్ములాగుంటది!/ బోయవాడి వేటుకు రాలిపడ్డ/ పక్షుల రెక్కల చప్పుడు లాగుంటది/ బిచ్చగాడి సత్తుపళ్ళెంలో/ ఎండిన పేగుల అపశృతుల పాటలాగుంటది/ దేవాలయాల మెట్లపై భిక్షువర్షియసీ పద్యంలా వుంటది!/ పేదవాడి కన్నుల్లో రాలే అగ్నివానలా వుంటది/ నేతన్నల రైతన్నల అనాథ శవాల మరణవాగ్మూలంలా వుంటది/ ఆకలిదెప్పుడూ విశ్వజనీన భాషే/ దు:ఖపిలో బతుకు ఘోషే/ ఆకలి ఆది అంతాలు లేని/ అనంత కవితా వాక్యమౌతుంది.." అన్నారు. ఆకలిని గూర్చి విపులీకరిస్తూ రాలిపడ్డ పక్షుల రెక్కల చప్పుడు, బిచ్చగాడి సత్తు పళ్లెం, ఎండిన పేగుల అపశృతి రాగంతో పోలుస్తూ ప్రశస్తమైన ప్రతీకలు వాడటం ఎంతో సముచితంగా ఉంది. చివరగా 'ఆకలిని ఆద్యంతాలు లేని అనంత కవితా వాక్యం అవుతుంది' అంటారు సరికొండ.

మకుటాయమానమైన మరో కరోనా కవితలో వలస కూలీల బతుకులను ప్రతిభావంతమైన కవితా వాక్యాలతో ఇలా వర్ణిస్తారు. "గాఢాంధకార చీకటిలో/ మృత్యు దీపం వెలుతురులో/ కరోనా వేలు పట్టుకొని/ కాలం తీగ మీద నడుస్తూ/ వల్లకాటి దారిలో పయనం అయ్యాడు/ నేల తల్లి చేతుల్లో నెత్తుటి పాదముద్రలై ..." అంటాడు. ఇక్కడ నేలను తల్లితో పోల్చడం సాధారణమైన పోలికైనా కరోనా బాధిత కార్మికులు నెత్తురోడుతున్న కాలి గాయాలతో పొట్ట చేత పట్టుకొని వందల కిలోమీటర్లు తమ గమ్యాన్ని చేరుకోవడానికి పాదయాత్రలు చేసిన సంఘటనలను నేలతల్లి చేతుల్లో నెత్తుటి పాదముద్రలు అనే విలక్షణమైన ప్రతీకగా మలచటం ప్రశంసనీయంగా ఉంది. నరసింహరాజు కవిత్వం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలచి ఉంటుంది. పీడిత తాడిత ప్రజల హృదయ ఘోషను కవిత్వ సజీవ జీవన భాషగా ఆవిష్కరిస్తున్న ఆత్మీయ సాహితీ మిత్రుడు నరసింహరాజుకి హృదయపూర్వక అభినందనలు. కవి ఫోను : 93982 54545.

– డాక్టర్ జెల్ది విద్యాధర్

## పిల్లల కోసం సైన్స్ ఫిక్షన్ కథలు, నవలల పోటీ

**లీలావతి దవే – సైన్స్ ఫిక్షన్ కథల పోటీ :** కథల పోటీలో 18 ఏళ్ళ లోపు వారు మాత్రమే పాల్గొనాలి. హామీ పత్రంపై ప్రిన్సిపాల్ ధృవీకరణ ఉండాలి. రచనలు చేరవల్సిన చివరి తేది : జనవరి 26, 2024. కథలకు మొదటి బహుమతి: రూ. 2500, రెండో బహుమతి: రూ.2000. మరో మూడు ప్రత్యేక బహుమతులు ఉంటాయి.

**విశాల లలిత – కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలల పోటీ :** నవల పిల్లలూ, పెద్దలూ ఆసక్తిగా చదివేలా ఉండాలి. ఏ4 సైజులో టైపులో 50– 60 పేజీలకు మించరాదు. ఏ వయసు వారైనా రాయవచ్చు. రచయిత పేరు హామీ పత్రం పైన మాత్రమే ఉండాలి. రచనలు చేరవలసిన చివరి తేది : ఫిబ్రవరి 10, 2024. ఎంపికైన నవలలకు మొదటి బహుమతి: రూ.5000. రెండో బహుమతి: రూ.. 3000. మరో రెండు ప్రత్యేక బహుమతులు ఉంటాయి. రచనలు పంపాల్సిన చిరునామా : డా॥ వి.ఆర్.శర్మ, 304, ఎండికోస్ కౌంటి అపార్ట్‌మెంట్, జెక్ కాలనీ, వీధి నెం : 2, సనత్ నగర్–500018. మరిన్ని వివరాలకు ఫోను : వి.ఆర్.శర్మ : 91778 87749, గరిపెల్లి అశోక్ : 98496 49101.

## పోస్టు కార్డు కథల పోటీ

సాహితీకిరణం గౌరవ సంపాదకులు గుదిబండి వెంకటరెడ్డి 83వ జన్మదినం సందర్భంగా సాహితీకిరణం ఆధ్వర్యంలో పోస్టుకార్డుల కథల పోటీ నిర్వహిస్తున్నాం. 5 ఉతత్మ కథలకు రూ.1000 చొప్పున సమాన బహుమతులు ఉంటాయి. కథ పోస్టు కార్డుపై మాత్రమే రాయాలి. సామాజిక స్పృహ కలిగిన ఏ అంశమైనా పరవాలేదు. కార్డు వెనకపక్క హామీపత్రం, చిరునామా రాయాలి. ఎంపికైన 83 కథలతో కథల సంకలనం ప్రచురించబడుతుంది. రచయితలు తమ కథలను 29.2.2024 లోపు ఎడిటర్ సాహితీకిరణం, 11–13–154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్–500102. చిరునామాకు పోస్టు ద్వారా మాత్రమే పంపాలి. విజేతలకు ఏప్రిల్ 2, 2024 హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో ప్రధానవేదికపై జరిగే సభలో జ్ఞాపిక, శాలువాతో సత్కారం ఉంటుంది. వివరాలకు సెల్: 98498 82783/ 94907 51681 సంప్రదించొచ్చు.

– సాహితీకిరణం

## 8న చక్రవర్తి ఏనుగు కథల సంపుటి ఆవిష్కరణ

ఎస్.హనుమంతరావు రచించిన 'చక్రవర్తి ఏనుగు' బాలల కథల సంపుటి పుస్తకావిష్కరణ జనవరి 8, 2024 సాయంత్రం 6 గంటలకు, విశాఖ పబ్లిక్ లైబ్రరీ, ద్వారకా నగర్, విశాఖలో జరుగుతుంది. సభలో జె. వి.సత్యనారాయణ మూర్తి, బేతా రామ సూర్య ప్రకాశరావు, గరిమెళ్ళ నాగేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, అడపా రామకష్ణ తదితరులు పాల్గొంటారు.

– అరసం, విశాఖపట్నం.

## చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు 2023 సంవత్సరానికి విశిష్టాద్వైత సాహిత్యానికి చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారం ఇవ్వడానికి నిర్ణయించారు. విశిష్టాద్వైత సంబంధ పద్యకావ్యాలు, వ్యాససంపుటాలు పంపవచ్చు. అవి 2019 – 23 మధ్య ప్రచురించబడి ఉండాలి. సంకలనాలు, అనువాదాలు పంపొద్దు. పరిశీలన నిమిత్తం నాలుగు ప్రతులు 29.2.2024 లోగా పంపాలి. పురస్కారం కింద రూ.5000, శాలువా, మెమొంటో అందజేస్తాం. పుస్తకాలు పంపాల్సిన చిరునామా : డాక్టర్ టి. శ్రీరంగస్వామి, అధ్యక్షులు, శ్రీలేఖసాహితి, ఇం.నం. 27–14–53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, మండల కార్యాలయం ఎదురుగా, హసన్‌పర్తి 506371, హన్మకొండ, వరంగల్ తెలంగాణ, ఫోన్ నం. 99498 57955.

– డా. టి.శ్రీరంగస్వామి

## నకిలీ పిఎంఓ అధికారిపై సిబిఐ చార్జిషీట్

**న్యూఢిల్లీ :** పిఎంఓ అధికారిగా మోసం, పిఎంఓ పేరును దుర్వినియోగం చేసిన కేసులో అహ్మదాబాద్‌కు చెందిన మయాంక్ తివారీపై సిబిఐ చార్జిషీట్ నమోదు చేసింది. మయాంక్ తివారీ పిఎంఓలో ఒక ఉన్నతస్థాయి అధికారిగా పనిచేస్తున్నట్లు నటిస్తూ డాక్టర్ అగర్వాల్స్ సంస్థ ప్రమోటర్లను బెదిరిస్తున్న కేసులో సుమారు మూడు నెలల పాటు విచారణ జరిపిన సిబిఐ తాజాగా న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో చార్జిషీటు నమోదు చేసింది. చార్జిషీటులోని వివరాల ప్రకారం కంటి ఆసుపత్రులను నిర్వహించే డాక్టర్ అగర్వాల్స్ సంస్థ ఫ్రాంచైజీ కోసం ఇండోర్‌లో ఆసుపత్రి నిర్వహిస్తున్న ఇద్దరు డాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. వారికి సుమారు రూ.16 కోట్లను చెల్లించింది. ఒప్పందంలోని నిబంధనలను ఇండోర్‌లోని వైద్యులు ఉల్లంఘించడంతో, తమ రూ.16 కోట్లను తిరిగి ఇవ్వాలని ఇండోర్‌లోని వైద్యులను కోరింది. ఈ వివాదం హైకోర్టుకు వెళ్లగా, ఒక మధ్యవర్తిని నియమించింది. ఆ మధ్యవర్తి తన మధ్యంతర ఉత్తర్వుల్లో నాలుగు వారాల్లోగా రూ.16.43 కోట్లు చెల్లించాలని ఇండోర్ వైద్యులను ఆదేశించారు. ఇదే సమయంలో మయాంక్ తివారీ పిఎంఓ అధికారిగా నటిస్తూ డాక్టర్ అగర్వాల్స్ ప్రమోటర్లపై బెదిరింపులకు దిగాడు. రూ.16 కోట్లను మరిచిపోవాలని, ఇండోర్ వైద్యులతో సమస్యను పరిష్కరించుకోవాలని బెదిరించసాగాడు. ఈ విషయం తెలిసిన పిఎంఓ సిబిఐకి ఫిర్యాదు చేసింది. విచారణ ప్రారంభించిన సిబిఐ అహ్మదాబాద్, ఇండోర్‌లలో సోదాలు నిర్వహించి, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది.

## నేటి నుంచి ఇంగ్లండ్‌లో రాజ్‌నాథ్ పర్యటన

- 22 ఏళ్ల తరువాత తొలి భారత రక్షణ మంత్రిగా రికార్డు

**లండన్ :** సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఇంగ్లండ్‌లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటించనున్నారు. దీంతో 22 ఏళ్ల తరువాత ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ నిలవనున్నారు. రాజ్‌నాథ్ బ్రిటన్ రక్షణ శాఖ మంత్రి గ్రాంట్ షాప్స్‌తోపాటు ఆ దేశ ప్రధానమంత్రి రిషి సునాక్, విదేశాంగ మంత్రి డేవిడ్ కెమెరూన్‌లతో కూడా భేటీ కానున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, ద్వైపాక్షిక, పారిశ్రామిక, రక్షణ సహకారాన్ని విస్తరించడంపై ఈ భేటీల్లో చర్చించనున్నారు. భారత్-ఇంగ్లండ్ సంబంధాలపైనే కాకుండా ఇండో-పసిఫిక్, పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లోని పరిస్థితులపైనా ఈ చర్చలు సాగనున్నాయి. 2002 జనవరిలో అప్పటి రక్షణ శాఖ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ చివరిసారిగా ఇంగ్లండ్‌లో పర్యటించారు.

# రుణ సాయంపైనా కోత

- కేరళ పట్ల కత్తిగట్టిన కేంద్రం
- ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విమర్శ



**తిరువనంతపురం :** ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రాష్ట్రం తీసుకునే రుణం మొత్తాన్ని భారీగా తగ్గించేసి కేరళను కేంద్ర ప్రభుత్వం ఊపిరాడకుండా చేస్తోందని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వ శత్రుపూరిత వైఖరికి ఇదొక నిదర్శనమని ఆయన అన్నారు. కనీసం ఏడు వేల కోట్ల రూపాయలు వస్తాయని భావించగా, రూ.1838 కోట్లు మాత్రమే తీసుకునేందుకు అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం తీరు ఆందోళనకరంగా ఉందని, సంక్షోభాన్ని అధిగమించేందుకు రాష్ట్రం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈచర్య కేరళ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని బాలగోపాల్ పేర్కొన్నారు. ఏటా చివరి త్రైమాసికంలో ఎక్కువ డబ్బు అవసరమయ్యే సమయం. ఒక్క మార్చిలోనే రూ.20 వేల కోట్లు కావాలి. రాజ్యాంగం ప్రకారం, ఫైనాన్స్ కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రానికి రావాల్సిన మొత్తంలో కోత విధించారు. ట్రెజరీతో సహా పబ్లిక్ ఖాతా పేరుతో తగ్గింపులు జరుగుతాయి. పబ్లిక్ ఖాతాలో డబ్బు లేదు, ఇంకా కట్ చేయబడింది. ఇది రాష్ట్రం యొక్క అన్ని ఆర్థిక గణనలను ప్రభావితం చేస్తుంది. జీతం, పెన్షన్, వైద్య సహాయం, సామాజిక పెన్షన్, నిర్మాణ పనులతో సహా రోజువారీ విషయాల కోసం కేరళ కష్టపడుతోంది. తగిన మొత్తంలో రుణం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మళ్లీ కేంద్రాన్ని సిఎం, ఆర్థిక మంత్రి ఆశ్రయించనున్నారు. కేంద్ర ప్రభుత్వం విరోధభావంతో వ్యవహరించకూడదు. పన్నులో సరైన వాటా కూడా చెల్లించడం లేదు. దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రపంచంలోని ఇతర రాష్ట్రాలు, దేశాల ముందు కేరళ ఆదర్శప్రాయమైన విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతోంది. రాష్ట్రం ఒక్కటే ఇంత చేయలేం. రాష్ట్రాలు మొత్తం వ్యయంలో 65 శాతం భరించాలి. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సులభతరం చేసేందుకు కృషి చేయాలని ఆర్థిక మంత్రి అన్నారు.

## విద్యుత్ ఒప్పందంపై శ్వేతపత్రం

- నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్

**శ్రీనగర్ :** జమ్మూకాశ్మీర్ రాష్ట్ర విద్యుత్ అభివృద్ధి కార్పొరేషన్ (జెకెఎస్‌పిడిసి)కు, రాజస్థాన్ ఊర్జ వికాస్ అండ్ ఐటి సర్వీసెస్ లిమిటెడ్‌కు మధ్య కుదిరిన విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని నేషనల్ కాన్ఫరెన్స్ తెలిపింది. ఈ ఒప్పందం విషయంలో వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేయాలని, ఇది జమ్ముకాశ్మీర్ ప్రజలకు ఏ విధంగా ప్రయోజనం చేకూరుస్తుందో వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. 'సాధారణంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కాలపరిమితి గరిష్ఠంగా 20 సంవత్సరాలు ఉంటుంది. ఈ ఒప్పందం 40 సంవత్సరాల పాటు అమలులో ఉండేలా సంతకాలు చేశారు. ముందుగా నిర్ణయించిన ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తారు. అయితే ఆ ధర ఎంతో తెలియదు. ఈ ఒప్పందం ద్వారా తమ వనరులను కొల్లగొడతారేమోనని కాశ్మీర్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు' అని ఆ ప్రకటనలో వివరించారు. ఈ నెల 3వ తేదీన రాటిల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ రాజస్థాన్ సంస్థతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఉన్న రాటిల్ జల విద్యుత్ ప్రాజెక్ట్ నుండి విద్యుత్ కొనుగోలుకు ఈ ఒప్పందాన్ని ఉద్దేశించారు. రాష్ట్రం తీవ్రమైన విద్యుత్ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను విక్రయిస్తోందని నేషనల్ కాన్ఫరెన్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## జ్ఞానవాపి మసీదు నివేదిక వెల్లడిపై 24న నిర్ణయం

**వారణాసి :** జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో భారత పురావస్తు శాఖ (ఎఎస్‌ఐ) నిర్వహించిన సర్వే నివేదికను బహిర్గతం చేయాలా? వద్దా? అన్న విషయాన్ని ఈ నెల 24న వారణాసి జిల్లా కోర్టు నిర్ణయించనుందని హిందువుల తరపు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ తెలిపారు. శనివారం జరిగిన విచారణలో న్యాయమూర్తి ఎ.కె.విశ్వేష్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు గతేడాది జులై 21న మసీదు ప్రాంగణంలో ఎఎస్‌ఐ శాస్త్రీయ సర్వే నిర్వహించి సీల్డు కవర్‌లో నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నివేదికను కనీసం నాలుగు వారాలపాటు బహిర్గతం చేయొద్దని బుధవారం ఎఎస్‌ఐ జిల్లా న్యాయస్థానాన్ని కోరింది. అవసరమైతే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరోసారి సర్వేకు ఆదేశించవచ్చంటూ అలహాబాద్ హైకోర్టు డిసెంబరు 19న ఉత్తర్వులు ఇచ్చినందున ఈ నివేదిక బహిర్గతం చేయరాదని ఎఎస్‌ఐ తన వాదనల్లో పేర్కొంది. ఈ కేసు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ నెల 19న విచారణకు రానున్న నేపథ్యంలో ఆ తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా న్యాయమూర్తి పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ సమీనాపై కక్ష సాధింపు ఆపండి

- హర్యానా ప్రభుత్వానికి విద్యావేత్తల డిమాండ్



ప్రొఫెసర్ సమీనా దల్వాయ్

**న్యూఢిల్లీ :** దుండగుల ట్రోలింగ్, పోలీసుల ఎఫ్ఐఆర్‌తో మానసిక క్షోభను అనుభవిస్తున్న జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సమీనా దల్వాయ్‌కు ఐదు వందల మందికి పైగా విద్యావేత్తలు సంఘీభావం ప్రకటించారు. మీ వెనుక మేమున్నామంటూ మద్దతు తెలిపారు. దల్వాయ్‌ను లక్ష్యంగా చేసుకొని ఇటీవల సోషల్ మీడియాలో దారుణంగా ట్రోలింగ్ చేశారు. ఏ తప్పూ చేయకపోయినా ప్రొఫెసర్‌పై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. దల్వాయ్ తన తరగతి గదిలో డేటింగ్ యాప్ 'బంబుల్'ను బోధనా సాధనంగా ఉపయోగించడమే ఆమె చేసిన నేరం. దీనిపై విద్యార్థులు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినప్పటికీ కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. సమీనాపై విషం చిమ్మేందుకు ఆమె మైనారిటీ గుర్తింపు, రాజకీయ విశ్వాసాలపై దాడి చేశారు. తరగతి గదిలో లైంగికత్వం, రాజకీయాలపై చర్చించడం మహిళల గౌరవానికి భంగకరంగా, విద్యార్థులపై వివక్ష చూపినట్లుగా భావించరాదని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రామచంద్ర గుహ, నందితా నారాయణ్, అచిన్ వనైక్, నందినీ సుందర్, తనికా సర్కార్, హర్బన్స్ ముఖియా తదితర విద్యావేత్తలు ఓ ప్రకటన విడుదల చేశారు. గత కొద్ది వారాలుగా సమీనా ఎదుర్కొంటున్న పరిస్థితిపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్య స్ఫూర్తికి విద్య కీలకమైనది. భారతీయ విశ్వవిద్యాలయాలపై జరుగుతున్న దాడుల పర్వంలో ప్రొఫెసర్ సమీనా దల్వాయ్‌పై జరిగినది తాజా దాడి. నవంబర్ 7న పాలస్తీనా అంశంపై యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఇ-మెయిల్‌లో అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది. ఇది ట్రోల్ చేసే వారికి లీక్ అయింది. దీంతో వారంతా దల్వాయ్‌పై హిందూ ఫోబియా కలిగిన వ్యక్తిగా ముద్ర వేశారు. పది రోజుల తర్వాత సమీనా తరగతిలో బోధిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రత్యక్షమయ్యాయి. న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్న మూడో సంవత్సరం విద్యార్థులతో ఆమె డేటింగ్ యాప్ బబుల్‌పై చర్చించారు. ఆ సందర్భంగా డేటింగ్ యాప్‌ను ఓ బోధనా సాధనంగా ఆమె ఉపయోగించారు. కొందరు దుండగులు తరగతి గదిలో దీనిని రికార్డు చేసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారు. దీనిపై హర్యానా మహిళా కమిషన్ దర్యాప్తు జరిపింది. సమీనా తప్పు చేశారని తేల్చింది. జరిగిన ఉదంతంపై వివరణ ఇచ్చే అవకాశం కూడా లేకుండా ఆమెకు యూనివర్సిటీ అధికారులు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆ తర్వాత హెచ్చరిక జారీ చేశారు. రాజకీయ ఒత్తిడులే దీనికి కారణం' అని విద్యావేత్తలు ఆ ప్రకటనలో వివరించారు. సమీనాపై కక్ష సాధింపు చర్యలకు వెంటనే స్వస్తి చెప్పాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముగ్గురు మాల్దీవుల మంత్రుల సస్పెన్షన్

- మోడీని అవమానించినందుకు చర్య

**మాలే :** సోషల్ మీడియాలో ప్రధాని నరేంద్ర మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి మరియం షియునా సహా ముగ్గురు మంత్రులను మాల్దీవులు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మోడీ తన లక్షద్వీప్ పర్యటన చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేసిన నేపథ్యంలో షియునా కామెంట్ చేశారు. మాల్దీవులు యువజన సంక్షేమ శాఖ సహాయ మంత్రులు మల్షా షరీఫ్, అబ్దుల్లా మహసూమ్ మజీద్‌లపై చర్యలు తీసుకున్నారు. వారిని సస్పెండ్ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మాల్దీవు లు విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కొందరు సినీ ప్రముఖులు లక్షదీవులకు సంఘీభావం ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారు. తమ దేశాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నదని, తమ పర్యాటక రంగంతో పోటీ పడే విషయంలో లక్షద్వీప్ సవాళ్లు ఎదుర్కొంటోందని, అక్కడ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకే మోడీ పర్యటించారని మాల్దీవులు మంత్రి అబ్దుల్లా మహ్జూమ్ మజీద్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఎందుకు సహించాలని ప్రశ్నించారు. ప్రముఖ నటులు జాన్ అబ్రహం, శ్రద్ధకపూర్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తదితరులు లక్షదీవుల ఆతిథ్యాన్ని, సముద్ర జీవనాన్ని కొనియాడారు. గత సంవత్సరం నవంబరులో మాల్దీవులు అధ్యక్షుడుగా మహమ్మద్ ముయిజూ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

## దళిత యువకుడు, ముస్లిం యువతిపై కర్ణాటకలో మూకదాడి

- తొమ్మిదిమంది అరెస్టు

**బెంగళూరు :** బహిరంగ ప్రదేశంలో కూర్చొని మాట్లాడుకుంటున్న దళిత యువకుడు, ముస్లిం యువతిపై దాడి చేసి, వారిని నిర్బంధించి ప్లాస్టిక్ పైపులు, ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టారు. కర్ణాటకలోని బెళగావిలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. సిఎం యువ నిధి పథకానికి దరకాస్తు చేసేందుకు 18 ఏళ్ల దళిత యువకుడు సచిన్ లమాని, 22 ఏళ్ల ముస్లిం యువతి ముస్కాన్ పటేల్ శనివారం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లారు. భోజన విరామ సమయం కావడంతో ఆ తర్వాత రావాలని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో వారిద్దరూ బెళగావిలోని కిల్లా సరస్సు వద్దకు చేరుకుని అక్కడ కూర్చొన్నారు. కొందరు ఆకతాయిలు సచిన్, ముస్కాన్ వద్దకు వచ్చి, మీరెవరంటూ ప్రశ్నించారు. ఆ మహిళ తన బంధువని సచిన్ చెప్పగా, ఇద్దరి పేర్లు అడిగారు. ముస్లిం మహిళతో కలిసి ఎందుకు ఉన్నావంటూ సచిన్‌ను ప్రశ్నించి వేధించారు. ఇంతలో మరో 13 మంది అక్కడకు చేరుకున్నారు. వారిద్దరిని అక్కడి నుంచి తీసుకెళ్లి గదిలో నిర్బంధించారు. తిట్టడంతోపాటు ప్లాస్టిక్ పైపులు, ఐరన్ రాడ్లతో సచిన్‌ను కొట్టారు. అతడి గొంతు నొక్కారు. ముస్కాన్‌పై కూడా దాడి చేశారు. బలవంతంగా మొబైల్ ఫోన్స్, వారి వద్ద ఉన్న రూ.7,000 నగదు లాక్కున్నారు. శనివారం సాయంత్రం వరకు వారిద్దరిని వేధించారు. ఆ తర్వాత బెదిరించి వారిని విడిచిపెట్టారు. అనంతరం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఐఎఎఫ్ మరో ఘనత

- రాత్రి వేళ కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్‌పై విమానం ల్యాండింగ్

**శ్రీనగర్ :** కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్‌లో నైట్ ల్యాండింగ్ మిషన్‌తో భారత వైమానిక దళం (ఐఎఎఫ్) మరో మైలురాయి సాధించింది. 8,800 అడుగుల ఎత్తులో హిమాలయ పర్వతాలపై ఉన్న జమ్ముకశ్మీర్‌లోని కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్‌పై రాత్రి సమయంలో సి-130జె విమానాన్ని తొలిసారి ల్యాండ్ చేసినట్లు ఐఎఎఫ్ ఆదివారం ప్రకటించింది. సవాళ్లతో కూడిన అననుకూల వాతావరణం, ఎత్తైన కొండ ప్రాంతాలు వంటి పరిస్థితుల్లో టెర్రైన్ మాస్కింగ్ టెక్నిక్‌ల ద్వారా ఆదివారం తెల్లవారుజామున ఐఎఎఫ్ సామర్థ్యాలను ప్రదర్శించినట్లు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మిషన్‌కు సంబంధించిన వీడియో క్లిప్‌ను ఐఎఎఫ్ షేర్ చేసింది. గరుడ్ కమాండోల శిక్షణలో భాగంగా ఈ విన్యాసం చేసినట్లు తెలిపింది. ఐఎఎఫ్ సి - 130 జె విమానానికి నాలుగు టర్బోప్రాప్ ఇంజిన్లు ఉంటాయి. భద్రతా బలగాలు, యుద్ధ సామాగ్రి తరలింపులో ఈ విమానాలు ముఖ్యపాత్ర పోషిస్తుంటాయి. ఐఎఎఫ్‌లో సి-130జె విమానాలు 12 ఉన్నాయి.

# ప్రధాని పీఠం మళ్లీ హసీనాకే

- 300 స్థానాలకు గాను 225 స్థానాల ఫలితాల వెల్లడి
- అవామీలీగ్‌కు 172
- 40 శాతం ఓటింగ్
- 14 పోలింగ్ స్టేషన్లు, రెండు స్కూళ్లకు నిప్పు
- ఎన్నికలు బహిష్కరించిన బిఎన్‌పి



అవామీలీగ్ కార్యకర్తల సంబరాలు

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో 12వ సాధారణ ఎన్నికల్లో ఊహించినట్లుగానే ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ వరుసగా నాలుగోసారి ఘనవిజయం సాధించింది. ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ఎన్నికలను బహిష్కరించటంతోపాటు బంద్‌కు పిలుపునివ్వడంతో 40 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. కడపటి సమాచారం అందేటప్పటికి మొత్తం 300 స్థానాలకుగాను 225 స్థానాలకు ఫలితాలను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ప్రభుత్వ ఏర్పాటుకు 151 స్థానాలు రావాల్సి ఉండగా, అంతకంటే ఎక్కువగానే 172 స్థానాలు అధికార అవామీలీగ్ ఇప్పటికే దక్కించుకోవడం గమనార్హం. అవామీలీగ్ మిత్రపక్షం జతియా పార్టీకి 8, ఇండిపెండెంట్లకు 46, ఇతరులకు 1 వచ్చినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగాయని అమెరికా పరిశీలకులు తెలిపారు. పోలింగ్ రోజు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు, అభ్యర్థుల మద్దతుదారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ ప్రారంభం కావటానికి ముందు కొందరు 14 పోలింగ్ స్టేషన్లు, రెండు స్కూళ్లకు నిప్పంటించారు. పోలింగ్ ప్రారంభమైన తర్వాత ఢాకాలోని ఒక పోలింగ్ కేంద్రంలో ప్రధాని షేక్ హసీనా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు కేంద్రాల్లో పోలింగ్‌ను మొత్తానికే రద్దు చేయటం గమనార్హం. ఛత్తోగ్రామ్, జమాల్‌పూర్, ఢాకాతో పాటు పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారు. ఢాకాలోని హజారీబాగ్‌లో ఒక పోలింగ్ స్టేషన్ సమీపంలో రెండు పెట్రోల్ బాంబులు పేలాయి. ఈ ఘటనలో ఒక చిన్నారి సహా నలుగురు గాయపడ్డారు.

అధికార అవామీ లీగ్ పార్టీ ఉద్దేశపూర్వకంగా డమ్మీ క్యాండిడేట్లను నిలిపిందనీ, షేక్ హసీనా ఉండగా ఎన్నికలు సాఫీగా జరగబోవని బిఎన్‌పి చీఫ్, మాజీ ప్రధాని ఖలేదా జియా ఆరోపించారు. అవామీ లీగ్ బంగ్లాదేశ్‌లో ఇప్పటి వరకు ఐదు సార్లు అధికారాన్ని దక్కించుకున్న పార్టీగా నిలిచింది.

# ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె

- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన మున్సిపల్ కార్మికుల ఆందోళనలు



కడపలో ఒంటికాలిపై నిల్చుని నిరసన

**ప్రజాశక్తి-యంత్రాంగం**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం కార్మికులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. చెవిలో పువ్వులు పెట్టుకొని, ఒంటికాలిపై నిల్చుని, మానవహారం చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ పోరాటం సాగిస్తామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు.

విశాఖలోని గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌పై నిలబడి పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ప్రజల మద్దతు కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో చెవిలో పువ్వులు పెట్టుకుని, ఇచ్ఛాపురం సమ్మె శిబిరంలో భజన చేస్తూ సమ్మెను కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మానవహారం చేపట్టి, నిరసన తెలిపారు. విజయనగరంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తూ ఫెడరేషన్ నాయకులు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. తిరుపతి జిల్లా గూడూరులో మానవహారం చేపట్టారు. కడపలో ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలియజేశారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో పొర్లుదండాలు పెట్టారు. కాకినాడలో మానవహారం నిర్వహించారు. ఏలూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏలూరులో సామూహిక ప్రార్థన చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కార్మికులు సర్వమతాల ప్రార్థనలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త తరలింపు వాహనం వీధుల్లోకి వెళ్లకుండా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని కార్మికులు స్పష్టం చేశారు. అనంతపురంలోని నగర పాలకసంస్థ కార్యాలయం ఎదుట నామాలు పెట్టుకుని చిడతలు (భజనలు) కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్‌టిఆర్, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాలో సమ్మె కొనసాగించారు.

## 'యానిమల్' వంటి సినిమాలు ప్రమాదకరం : జావేద్ అక్తర్

**ముంబయి :** 'యానిమల్' వంటి సినిమాలు సమాజానికి చాలా ప్రమాదకరమని బాలీవుడ్ సీనియర్ లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ వ్యాఖ్యానించారు. ఔరంగాబాద్‌లో ఇటీవల జరిగిన 'అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ప్రస్తుత సినిమా పరిస్థితుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సినిమాలు భారీ విజయాన్ని నమోదు చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ సినిమాలో ఒక సీన్‌లో హీరో తన ప్రేమను నిరూపించుకోవడానికి హీరోయిన్‌ను బూట్లు నాకాలని అనడం, మరో సీన్‌లో మహిళలను చెంపదెబ్బ కొట్టడం సరైనదేనని చెప్పడం వంటి సన్నివేశాలు ఉన్నాయని, అయినప్పటికీ ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఎలా హిట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని జావేద్ అక్తర్ అన్నారు. సమాజానికి ఇది ఎంతో ప్రమాదకరమని చెప్పారు. సమాజం మెచ్చుకునేలా పాత్రలను రూపొందించాలనుకునే ఈనాటి యువ చిత్ర నిర్మాతలకు ఇది పరీక్షా సమయమని తాను భావిస్తున్నానని అన్నారు. మన సినిమాల్లో నైతిక విలువలు ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి సినిమాలు చూడాలి అనేది ప్రేక్షకులే నిర్ణయించుకోవాలని, ప్రస్తుతం బంతి ప్రేక్షకుల కోర్టులో ఉందని అన్నారు. తెరపై హీరో పాత్రను ప్రెజెంట్ చేయడం రచయితలకు పెద్ద సవాలుగా మారిందన్నారు. సమాజంలో ఏది ఒప్పు, ఏది తప్పు అనే దానిపై స్పష్టంగా ఉన్నప్పుడు గొప్ప పాత్రలు వస్తాయని, కానీ ప్రస్తుతం సమాజంలోనే గందరగోళం నెలకొందని తెలిపారు.

## కాబూల్‌లో భారీ పేలుడు.. ఐదుగురు మృతి

- మరో 15 మందికి గాయాలు



**కాబుల్ :** కాబూల్ పశ్చిమ ప్రాంతంలో ని దష్ట్-ఎ-బర్చి ప్రాంతంలో కోస్టర్ మోడల్‌గా గుర్తించబడిన మినీ బస్సులో శనివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్లు ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ప్రకటించింది. 2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సున్నీలకు ప్రాతినిధ్యం వహించే ఇస్లామిక్ స్టేట్ తీవ్రవాద సంస్థ కాబూల్, ఉత్తర ప్రావిన్స్‌లలో షియాలే లక్ష్యంగా దాడులు చేస్తోంది.

## ఫిబ్రవరి 8న దళిత సింహ గర్జన : మాజీ మంత్రి హర్షకుమార్

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

వైఎస్ జగన్ ప్రభుత్వం దళితులకు చేసిన ద్రోహాన్ని ఎండగట్టేందుకు ఫిబ్రవరి ఎనిమిదిన దళిత సింహగర్జన ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపి జివి హర్ష కుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వేమగిరిలో సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దళితులకు వైఎస్ జగన్ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. డాక్టర్ సుధాకర్‌తో పాటు అనేకమంది దళితులపై దాడులు జరిగాయని, మరికొందరు వేధింపులకు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు అమలు చేయాల్సిన 27 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఇతర పథకాలకు దారి మళ్లించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు రిజర్వేషన్‌లో కేటాయించాల్సిన మెడికల్ కాలేజీ సీట్లునూ అమ్ముకుంటోందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు చేస్తున్న ద్రోహాన్ని దళిత సింహం గర్జన సభలో ప్రజలకు వివరిస్తామన్నారు. 56 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ సభకు లక్షలాది మందికి పైగా దళితులు హాజరవుతారని తెలిపారు.



మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

## పిల్లలకు పుస్తకాలను పరిచయం చేయాలి

- సినీ నటులు తనికెళ్ల భరణి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

చూడడం నుంచి చదవడంవైపునకు పిల్లలను మళ్లించాల్సిన బాధ్యత పెద్దలకు ఉందని కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న 34వ పుస్తకమహోత్సవం ఆదివారంతో ముగిసింది. ముగింపు సభలో తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు అపారమైన సాహిత్య నిధి ఇచ్చి వెళ్లారన్నారు. అక్షరం అంటే నాశనం లేనిదని గుర్తు చేశారు. పుస్తకంలోని ఒక పేజీ తీస్తే ప్రపంచానికి ఒక కొత్త కిటికీ తీసినట్లేనన్నారు. కొత్త తరానికి పుస్తకాలను, సాహిత్య విలువలను పరిచయం చేయడంలో పుస్తకమహోత్సవం పోషిస్తున్న పాత్ర ఆనందదాయకమన్నారు. ప్రపంచంలో మొబైల్ వ్యాధిగ్రస్తులు కాకుండా పిల్లలను కాపాడుకునేందుకు పుస్తకాలను పరిచయం చేయాలని సూచించారు. పుస్తకాలతో స్నేహం దీర్ఘకాలిక ఆనందాన్నిచ్చే శాశ్వతబంధమని తెలిపారు. చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు జీవిత చరిత్రలు చదవడం ఉపకరిస్తుందన్నారు. 'అనుభవాలు-జ్ఞాపకాలూ', 'నా జీవనయానం', 'హంపీ నుంచి హరప్పా దాకా' పుస్తకాలు చదవడం ద్వారా తెలుగునేల మూడు ప్రధాన భాగాల సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. సాహిత్యం వ్యక్తులకు రసస్ఫూర్తినిచ్చే రోజుల నుంచి సామాన్యుల కష్టాలను ప్రతిఫలించే రోజులకు మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ సిఇఒ ఇంతియాజ్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్, పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపుబాబ్జీ, గోళ్ల నారాయణరావు సభలో పాల్గొన్నారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు.



## మీ కోసం


ఒక కప్పు ఉసిరి పొడి, రెండు కప్పుల పెరుగు కలిపి రాత్రంతా నాననిచ్చి, మరుసటి రోజు తలకు పట్టించి, ఒక గంట తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే తెల్లజుట్టు నల్లబడుతుంది.

## జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ చెయ్యగలడు.

JEEVANA జీవన the family

# జింక ఉపాయం పారిందోచ్!



ఒక దట్టమైన అడవిలో సింహం ఉండేది. అది మంచి చెడుల విచక్షణ లేకుండా కంట పడిన జంతువులను వేటాడి తినేది. దీంతో అడవిలోని జంతువులు దిన దిన గండంగా బతుకుతున్నాయి. ఆ సింహానికి నాట్యం అంటే విపరీతమైన ఇష్టం. ఒకరోజు ఆకలితో ఉండి వేటకోసం ఎదురు చూస్తున్న సింహానికి రెండు కోతులు కనిపించాయి. 'భలే! రెండు పూటలకు సరిపడా ఆహారం' అనుకుని వాటి మీదకు పంజా విసరబోయింది. తృటిలో తప్పించుకున్న రెండు కోతులు 'మగరాజా! మీ కోసమే నాట్యం నేర్చుకుని వచ్చాం. మీకు రోజూ చక్కటి వినోదం కలిగిస్తాం' అంటూ నాట్యం ఆరంభించాయి.

మృగరాజు ఆకలి మరచిపోయి వాటి నాట్యం చూసింది. కాసేపటి తరువాత నాట్యం ఆపిన కోతులు రేపు మళ్ళీ వస్తామంటూ అక్కడ నుండి సెలవు తీసుకున్నాయి. ఈ విషయం తెలిసిన మిగిలిన జంతువులు కోతుల సమయస్ఫూర్తికి అభినందించాయి.

సింహానికి ఉన్న బలహీనతను ఆధారం చేసుకుని దాన్ని మట్టుపెట్టడం ఎలా అని జంతువులన్నీ కలిసి సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించుకున్నాయి.


తెలివైన జింక బాగా ఆలోచించి ఒక ఉపాయం చెప్పింది. ఆ ప్రణాళిక కోతుల ద్వారా అమలుచేయాలని నిర్ణయించుకున్నాయి. కోతులు సింహంతో 'రాజా! మీకు వినోదం కలిగించడానికి మడుగు దగ్గర నాట్యసభ ఏర్పాటు చేస్తున్నాము. నాట్యం చేయలేక ఆపిన జంతువుని అక్కడికక్కడే మీరు ఆరగించవచ్చు' అని చెప్పాయి. 'కోరి నాకు ఆహారంగా మారడానికి మీరంతా తరలి వస్తున్నారా?' అని సింహం పెద్దగా నవ్వి 'సరే' అంది.

ఒక పెద్ద చెట్టు కింద మడుగు చుట్టూ జంతువులన్నీ వృత్తాకారంలో నిలబడి నాట్యం చేస్తున్నాయి. సింహం చెట్టు కింద నిలబడి ఆనందంగా నాట్యం ఎవరు ఆపుతారా అని చూస్తోంది. ఉన్నట్లుండి దాని దృష్టి మడుగు మీద పడింది. అక్కడ ఒక కోతి కదలకుండా నిలబడి కనిపించింది. అంతే! ఆలోచించకుండా మడుగులోకి దూకింది. అది లోతైనది కావడంతో అందులో కూరుకుపోయింది.

హమ్మయ్యా! పాచిక పారిందనుకుంటూ చెట్టు మీద నుండి ఓ కోతి కిందకు దిగింది. తెలివిగా తన నీడను నీటిలో కనిపించేలా నిలబడి సింహాన్ని దానికదే మడుగులో పడేలా ప్రణాళిక చేసినందుకు జింకను జంతువులన్నీ మెచ్చుకున్నాయి. సింహం పీడా వడిలినందుకు ఆనందంగా పండగ చేసుకున్నాయి.

**కె.వి.సుమలత,**
**కృష్ణ జిల్లా,**
**94926 56255.**

## చుక్కలు కలపండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా కలపండి. అందమైన పక్షి బొమ్మ వస్తుంది చూడండి.

## నేను గీసిన బొమ్మ



సాతివల్లి చందన నాగ వెంకట సత్య బ్రహ్మణి,
7వ తరగతి, శ్రీ తిమ్మరాజు హైస్కూల్,
వెంకటరాయపురం, తణుకు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# పేదింటి 'మణి' పూస

**పేదరిక కుటుంబం ఆమెది. పెద్ద చదువులు చదివించాలని అమ్మానాన్న ఎంతో తపన పడ్డారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై ఎన్నో కలలుగన్న తండ్రి వారి ఉన్నతిని చూడకుండానే అర్థంతరంగా చనిపోయాడు. ఇంత పెద్ద విషాదంలోనే ఆ తల్లి బిడ్డల బాధ్యత నెత్తికెత్తుకుంది. తండ్రి లేని లోటు తెలియకుండా అంగన్‌వాడీ కార్యకర్తగా అరకొరా జీతంతోనే ఇద్దరు బిడ్డలను చదివించింది. ప్రయోజకులను చేసింది. ఇప్పుడు ఆ బిడ్డల్లో మొదటి బిడ్డ గిరిజామణి 2022 నోటిఫికేషన్‌లో ఎస్‌ఐ ఉద్యోగం సాధించి ఆ తల్లి పడ్డ కష్టానికి ప్రతిఫలం అందించింది.**


రావాడ గిరిజామణి స్వస్థలం విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం. రేగ పంచాయతీలో ఓ మారుమూల గ్రామం. ఎర్రినాయుడు, వరలక్ష్మి దంపతుల తొలిసంతానం. పదేళ్ల క్రిందట అనారోగ్యం కారణంగా ఎర్రినాయుడు మృతి చెందారు. వరలక్ష్మి అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తున్నారు. గిరిజామణి చదువుతో పాటు ఆటల్లో రాణించారు. ఎన్‌సిసితో పాటు అనేక క్రీడల్లో జాతీయస్థాయి గుర్తింపు పొందారు.

విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన ఆమె, నేషనల్ కాడిట్ కాప్స్ (ఎన్‌సిసి)లో ఏ ,బి ,సి సర్టిఫికెట్స్ సాధించారు. 2018లో ఢిల్లీలో జరిగిన ఎన్‌సిసి నేషనల్ టెల్ సైనిక్ క్యాంపులో సిల్వర్ మెడల్ సాధించారు. 100 మీటర్ల అథ్లెటిక్స్, లాంగ్ జంప్ ఇలా పలు క్రీడల్లో ప్రతిభ కనపర్చడం గిరిజామణికి చిన్నప్పటి నుండి అబ్బింది. ప్రభుత్వ రంగంలో ఏదేని ఉద్యోగం సాధించాలన్న తండ్రి కల నెరవేర్చడం కోసం 2022 బ్యాచ్ ఎస్‌ఐ నోటిఫికేషన్‌లో ఓపెన్ క్యాటగిరి నుంచి పోటీకి సిద్ధమై ఎస్‌ఐ ఉద్యోగం సంపాదించారు.

**కట్నం డబ్బులతో చదివించమన్నాను**



'అమ్మ నాకు ప్రత్యక్ష దైవం. చిన్ననాటి నుంచి చదువు పట్ల ముందంజలో ఉండేదాన్ని. 9వ తరగతి చదువు తున్నప్పుడే నాన్న చనిపోయారు. ఆ దిగులుతో కొన్ని రోజులు చదవలేక పోయాను. అమ్మే నన్ను ప్రోత్సహించింది. ధైర్యం చెప్పింది. నాన్న లేని లోటు తెలియకుండా నన్ను, చెల్లిని చదివించింది. అయితే ఒక్కోసారి బంధువులు, ఇరుగు పొరుగు వారు అనేమాటలకు ఎంతో బాధపడేది. 'చదువులు, ఆటలు అంటూ డబ్బులు తగలేస్తే మీకు ఎలా పెళ్లి చేయాల'ని ఏడ్చేది. అప్పుడు 'పెళ్లికి ఇవ్వాలనుకునే కట్నం డబ్బులతో మమ్మల్ని చదివించమ'ని అమ్మకు ధైర్యం చెప్పేదాన్ని. ఇప్పుడు నాన్న ఉంటే ఎంతో సంతోషపడేవాడు. నేను సాధించిన విజయాన్ని చూడకుండానే చనిపోయాడు' అంటూ కంటతడి పెడుతూ చెబుతున్న గిరిజామణి త్వరలో ఏడాదిపాటు శిక్షణ నిమిత్తం అనంతపూర్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు.



**ఎస్‌ఐ ఎంపిక ఆనందాన్నిచ్చింది**

'నాకు గిరిజామణి, జానకిదేవి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె జానకిదేవి ప్రస్తుతం డిగ్రీ చదువుతుంది. కుమార్తెలనే కుమారులుగా భావిస్తూ చదివిస్తున్నాను. గిరిజామణి చాలా పట్టుదలతో చదివి ఎస్‌ఐ ఉద్యోగం సాధించింది. నాకు చాలా ఆనందంగా ఉంది. మీ అమ్మాయి ఎస్‌ఐ ఉద్యోగం సాధించి, ఎంతోమంది ఆడపిల్లలకు ఆదర్శంగా నిలిచిందని ఇరుగుపొరుగు వాళ్ళు, నాతోటి సహొద్యోగులు ప్రశంసిస్తుంటే గర్వంగా ఉందం'టూ బిడ్డల ప్రగతి గురించి చెబుతున్న వరలక్ష్మీ కళ్లల్లో ఆనందభాష్పాలు స్పష్టంగా కనిపించాయి.



**అక్క స్ఫూర్తితో ముందుకు**

'అక్కనే స్ఫూర్తిగా తీసుకొని బాగా చదువుతున్నాను. సాఫ్ట్ వేర్ రంగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం. ఇప్పుడు మా అక్క ఎస్‌ఐగా ఎంపికై నాకే కాదు, నాలాంటి పేదింటి ఆడపిల్లలకు గొప్ప స్ఫూర్తినిచ్చింది. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న మాకు ఆయన లేని లోటును తీర్చి, ఇంత ఉన్నత స్థానంలో నిలిపిన ఘనత మాత్రం మా అమ్మదే' అంటోంది గిరిజామణి చెల్లి జానకీదేవి.

**- పి శ్రీనివాసరాజు,**
**లక్కవరపు కోట ప్రజాశక్తి విలేకరి,**
**94407 52657.**

## ఈ టీతో చలికాలం సమస్యలకు చెక్



చలికాలంలో ఆహారం, ఆరోగ్యంతో పాటు జీవనశైలిలో కొన్ని రకాల మార్పులు తప్పనిసరి. ఈ కాలంలో జామ ఆకు టీని తీసుకోవడం వల్ల అనేక సమస్యలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

- జామ ఆకు టీని రోజూ ఉదయం తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ ఆకులలో విటమిన్ సి అధిక స్థాయిలో ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు ఇన్ఫెక్షన్‌లతో పోరాడటానికి సహాయపడే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఇందులో ఉంటాయి.
- ఈ టీని రోజూ తాగడం వల్ల గొంతు మంట తగ్గడంతో పాటుగా ఈ కాలంలో ఎక్కువగా బాధించే దగ్గు, జలుబు వంటి సమస్యలు కూడా పూర్తిగా తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.
- చలికాలంలో ఎక్కువగా అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు వేధిస్తుంటాయి. యాంటీ బాక్టీరియల్ లక్షణాలు జామ ఆకుల్లో పుష్కలంగా ఉంటాయి కాబట్టి ఈ టీ తాగడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టవచ్చు.
- జామ ఆకు టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి.
- ఈ టీలో విటమిన్ సి అధికంగా ఉండటం వల్ల చర్మ సమస్యలు కూడా పూర్తిగా తగ్గుతాయి.

## రంగవల్లి





గుడిపాటి నాగ శ్రీ లలిత.
విజయవాడ

16 చుక్కలు , 6 వరసలు
6వరకు - సరిచుక్క

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

# బిజెపి హటావో దేశ్ బచావో



కోల్‌కతాలో డివైఎఫ్‌ఐ నిర్వహించిన భారీ ర్యాలీకి హాజరైన అశేష ప్రజానీకం

- టిఎంసి హటావో బెంగాల్ బచావో
- డివైఎఫ్‌ఐ భారీ ర్యాలీలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశాన్ని కాపాడేందుకు కేంద్రంలో మతతత్వ-కార్పొరేట్ అనుకూల బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని, అవినీతి, హింసతో బెంగాల్‌ను భ్రష్టు పట్టించిన తృణమూల్ కాంగ్రెస్‌ను ఇంటికి సాగనంపాలని ఆదివారం నాడిక్కడ జరిగిన డివైఎఫ్ఐ మహా ర్యాలీ పిలుపునిచ్చింది. ప్రజాసమస్యలపై పోరాటాన్ని రెట్టించిన పట్టుదలతో కొనసాగిస్తామని ప్రతిన బూనింది. అందరికీ విద్య, ఉపాధి కల్పించాలని, అవినీతి, హింసను రూపుమాపాలని, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బెంగాల్ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ చేపట్టిన రాష్ట్రవ్యాపిత ఇన్సాఫ్ యాత్ర 50 రోజుల పాటు 22 జిల్లాల్లో 2,400 కి.మీ పొడవునా సాగింది. ఈ యాత్ర ముగింపు సందర్భంగా కొల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహా ర్యాలీకి రాష్ట్ర నలుమూలల నుంచి యువత దండులా కదలివచ్చింది. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావం తెలిపింది. నగరంలోని ఏడు సెంటర్ల నుంచి ప్రదర్శనగా బయల్దేరి కొల్‌కతా పుర వీధుల గుండా సాగి బ్రిగేడ్ పరేడ్ మైదానానికి చేరింది. 'బిజెపి హటావో దేశ్ బచావో, టిఎంసి హటావో బెంగాల్ బచావో' అంటూ నినాదాలతో గర్జించారు. 'పని హక్కు, విద్య హక్కు అమలు కావాలి, అవినీతి, అల్లర్లను తరిమికొట్టాలి, దేశాన్ని, బెంగాల్‌ను కాపాడాలి' వంటి నినాదాలతో కొల్‌కతా హోరెత్తింది. అంతకుముందు కళాకారులు గీతాలు, సంగీత నృత్యాలతో ప్రజలను ఆలోచింపజేశారు. ఈ ర్యాలీకి తరలివచ్చిన అశేష జనవాహినితో బ్రిగేడ్ పరేడ్ మైదానం పులకించిపోయింది. ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన వారిని కొన్ని చోట్ల పోలీసులు అడ్డుకున్నారు. డార్జిలింగ్ వంటి సుదూర ప్రాంతాల నుంచి అనేక కష్ట నష్టాలకోర్చి యువతీ యువకులు ఒక రోజు ముందుగానే కొల్‌కతా నగరానికి చేరుకున్నారు. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడతామని ర్యాలీలో పాల్గొన్న వారంతా ప్రతిన బూనారు. వీరిచేత డిఐఎఫ్ఐ బెంగాలః రాష్ట్ర కార్యదర్శి మీనాక్షి ముఖర్జీ ఈ ప్రమాణం చేయించారు. మాజీ ముఖ్యమంత్రి , డివైఎష్ఐ మొట్ట మొదటి కార్యదర్శి బుద్ద దేవ్ భట్టాచార్య ఇన్సాఫ్ ర్యాలీకి తన సందేశాన్ని పంపారు. ఈ ర్యాలీ నుద్దేశించి డివైఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు మహ్మద్ సలీం,డివైఎఫ్ఐ ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు ఎఎ రహీం, హిమఘ్నరాజ్ భట్టాచార్య, డివైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి అవాస్ రాయ్ చౌదరి, డివైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షులు ధ్రువజ్యోతి సాహా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సృజన్ భట్టాచార్య తదితరులు మాట్లాడారు.



మోడీ ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన కళారూపం

మహ్మద్ సలీం తొలుత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని టిఎంసికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. 'ఒకప్పుడు పాకిస్తాన్, పుల్వామా దాడులు పేరుతో జాతీయవాద భావాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించిన వారు (2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు) ఇప్పుడు కులం, మతాల ఆధారంగా ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల నుండి తమ నాయకులను రక్షించడానికి 'బిజెపితో టిఎంసి అంతర్గత అవగాహన' కలిగి ఉందని దుయ్యబట్టారు.

**అసలు ఆట ఇప్పుడు మొదలైంది : మీనాక్షి ముఖర్జీ**

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మీనాక్షి ముఖర్జీ మాట్లాడుతూ.. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లోని ఈ మైదానంలో డివైఎఫ్ఐ ఇన్సాఫ్ యాత్ర ముగిసిందని, అయితే తమ అసలు పోరాటం ఇక్కడి నుంచే మొదలైందని అన్నారు. ఇప్పుడు మనం ఆడాల్సింది 'టెస్టు మ్యాచ్‌లు' తప్ప 'టి-20' కాదు. మొత్తం వ్యవస్థను మార్చేందుకు పోరాడాలి. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి చెందినవారు ఇందులో కలసి రావాలని కోరారు. 'ఆట' మొదలెట్టేందుకు మైదానాన్ని తమ అధీనంలోకి తీసుకోడానికి పశ్చిమ బెంగాల్ యువత వచ్చారని మీనాక్షి ముఖర్జీ అన్నారు. 'మేము న్యాయం కోసం పోరాటంలోకి ప్రవేశించాం, వెనక్కి తగ్గే ప్రశ్న లేదు. న్యాయం కోసం పోరాటం తాత్కాలికమైనది కాదు, నిరంతరమైనదని ఆమె స్పష్టం చేశారు.

డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎఎ రహీం, హిమఘ్నరాజ్ భట్టాచార్య మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగం, అవినీతి, యువతకు ద్రోహం వంటి వాటి వల్ల యువత కలలు పూర్తి కాలేదని అన్నారు. దేశంలో 23.5 శాతం యువత ఉద్యోగం లేక నిరుద్యోగులుగా ఉన్నారని, అందులో మీ కుటుంబ సభ్యులు, మీ స్నేహితులు, మీ పక్కింటి వారు ఉన్నారని గుర్తు చేశారు. దేశంలో నిరుద్యోగం, అవినీతి తీవ్రమైన సమస్యలని అన్నారు. 'మోడీ పకోడీలు వేసుకోమంటున్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిండ్లు చేసుకోమంటున్నారు' అని విమర్శించారు.

పశ్చిమ బెంగాల్ సంస్కృతి, కళలకు కేంద్రమని, అయితే మమతా బెనర్జీ హయాంలో బెంగాల్ అవినీతికి, బంధుప్రీతికి రాజధానిగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ ర్యాలీ మన వర్తమానాన్ని దోచుకుని, మన భవిష్యత్తును తాకట్టు పెట్టే వారికి మేల్కొలుపు అని అన్నారు. ఈ సందేశం కోల్‌కతా నుండి ఢిల్లీ వరకు ప్రతిధ్వనించాలని పిలుపునిచ్చారు. యువత కలలను ముక్కలు చేస్తే వారు మౌనంగా ఉండరని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. తాము ఐక్యం అవుతామని, నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా హిందూ, ముస్లీం, క్రైస్తవ, ఆదివాసులందరం ఐక్యమై పోరాడుతామని అన్నారు.

# రోహిత్, కోహ్లి రీఎంట్రీ

- ఆఫ్ఘనిస్తాన్‌తో టి20 సిరీస్
- భారత జట్టు ప్రకటన



**ముంబయి :** ఈ నెల 11, 14, 17 తేదీల్లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం భారత జట్టును ఆదివారం ప్రకటించారు. సుమారు 14 నెలల తర్వాత రోహిత్, విరాట్ పొట్టి ఫార్మాట్‌లోకి (అంతర్జాతీయ క్రికెట్) రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. ఇటీవలే సౌతాఫ్రికాపై సెంచరీ (వన్డేలో) చేసిన సంజూ శాంసన్‌కు టి20 జట్టులో చోటు లభించింది. బుమ్రా, సిరాజ్‌కు సెలెక్టర్లు విశ్రాంతినిచ్చారు. గాయాలు కారణంగా రుతురాజ్ గైక్వాడ్, సూర్యకుమార్ యాదవ్ జట్టుకు దూరమయ్యారు. వన్డే వరల్డ్‌కప్ సందర్భంగా గాయపడిన హార్దిక్ ఇంకా కోలుకోలేదని సెలెక్టర్లు చెప్పారు. రవీంద్ర జడేజా, కెఎల్ రాహుల్‌కు సెలెక్టర్లు రెస్ట్ ఇచ్చారు. ఈ సిరీస్ కోసం ఆఫ్ఘనిస్తాన్ జట్టును ఇదివరకే ప్రకటించారు. ఆ జట్టుకు సారథిగా ఇబ్రహీం జద్రాన్ వ్యవహరించనున్నాడు. ఇటీవలే వెన్నునొప్పికి సర్జరీ చేయించుకున్న రషీద్ ఖాన్ కూడా ఈ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సిరీస్ కోసం ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్లు ఆదివారం భారత్‌కు చేరుకున్నారు.

**టీమిండియా :**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభమన్ గిల్, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, అవేష్ ఖాన్, ముఖేష్ కుమార్

**ఆఫ్ఘనిస్తాన్ :**

ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మతుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇక్రమ్ అలీఖిల్ (వికెట్ కీపర్), హజ్రతుల్లా జజాయ్, రహ్మత్ షా, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ నబీ, కరీం జనత్, అజ్మతుల్లా ఒమర్జాయ్, షరాపుద్దీన్ అష్రఫ్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫారూఖీ, ఫరీద్ అహ్మద్, నవీన్ ఉల్ హక్, నూర్ అహ్మద్, మహ్మద్ సలీం, కైస్ అహ్మద్, గుల్బడిన్ నైబ్, రషీద్ ఖాన్

## రెండో టీ20లో ఆసీస్ గెలుపు

- రేపు నిర్ణయాత్మక మ్యాచ్

**ముంబయి :** భారత మహిళల క్రికెట్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్ విధించిన 131 పరుగుల లక్ష్యాన్ని 19 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేధించింది. పెర్రీ 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-1తో ఆసీస్ సమం చేసింది. కీలకమైన మూడో మ్యాచ్ ఈ నెల 9న జరగనుంది. ఈ సిరీస్‌లో తొలిమ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. కాగా, ఆస్ట్రేలియా జట్టు ఈ పర్యటనలో తొలిగా జరిగిన ఏకైక టెస్టులో ఘోరంగా పరాజయం చెందింది. అయితే తరువాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. కాగా, ఆదివారం మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులే చేసింది. భారత బ్యాటర్లలో ఒక్కరూ భారీ స్కోరు చేయలేకపోయారు. దీప్తి శర్మ (30,27 బంతుల్లో) టాప్ స్కోరర్‌గా నిలిచారు. స్మృతి మంధాన (23), రిచా ఘోష్ (23) ఫర్వాలేదనిపించారు. జెమీమా రోడ్రిగ్స్ (13) పరుగులు చేయగా.. ఓపెనర్ షఫాలీ వర్మ (1), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (6) తీవ్ర నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లలో కిమ్ గార్త్, జార్జియా వేర్‌హామ్, అనాబెల్ సదర్లాండ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. ఆష్లీన్ గార్డ్‌నర్‌కు ఒక వికెట్ దక్కింది.

## ఆస్ట్రేలియా ఓపెన్‌కు నాదల్ దూరం



**మెల్‌బోర్న్ :** త్వరలో జరిగే ఆస్ట్రేలియా ఓపెన్‌కు స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ దూరంగా ఉన్నాడు. గాయం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ విషయాన్ని నాదెల్ స్వయంగా వెల్లడించాడు. 'ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొనడం లేదు. 'కండరాల్లో చీలిక' గాయం కారణంగా దూరంగా ఉంటున్నాను. త్వరలోనే కోలుకుని వచ్చేస్తా' అని ట్వీట్ చేశాడు. 'బ్రిస్బేన్‌లో ఇంటర్నేషనల్ టోర్నీ క్వార్టర్ ఫైనల్ సందర్భంగా కండరాలకు సంబంధించి చిన్న సమస్య వచ్చింది. కాస్త నన్ను ఆందోళనకు గురి చేసింది. మెల్‌బోర్న్ వెళ్లి ఎంఆర్‌ఐ స్కాన్ తీయించా. కండరాల్లో చిన్నపాటి చీలిక కనిపించింది. అయితే, గతంలో నా శరీరంలో ఎక్కడైనా గాయపడ్డానో అక్కడే ఈసారి జరగకపోవడం శుభవార్తే. త్వరగా కోలుకొని మీ ముందుకొస్తా. ఇప్పుడు నేను ఐదు సెట్ల మ్యాచ్‌లకు సిద్ధంగా లేను. అందుకే, ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నా. తదుపరి చికిత్స కోసం స్పెయిన్‌కు వెళ్లి వ్యక్తిగత డాక్టర్‌ను కలుస్తా. కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుని ప్రాక్టీస్ మొదలుపెడతా" అని ట్వీట్ చేశాడు.

## పుజారా డబుల్ సెంచరీ

**భారత జట్టులో స్థానంపై ఆశలు**

రాజ్‌కోట్ : రంజీ ట్రోఫీ 2023-24లో ఛతేశ్వర పుజారా ఆదరగొట్టాడు. సౌరాష్ట్ర జట్టు తరుపున బరిలోకి దిగిన పుజారా 243 పరుగులతో అజేయంగా నిలిచాడు. జట్టులో మరో ఆటగాడు ప్రేరక్ మన్కడ్ (104 పరుగులు) సెంచరీ చేశాడు. దీంతో 406/4 స్కోరుతో మూడో రోజు, ఆదివారం ఆటను ప్రారంభించిన సౌరాష్ట్ర.. 578/4 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. 436 పరుగుల ఆధిక్యం సాధించింది. తరువాత రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జార్ఖండ్ ఆదివారం ఆట ముగిసే సరికి 45 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 142కే ఆలౌటైంది. కాగా, పుజారాకు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇది రెండో 17వ డబుల్ సెంచరీ. దీంతో ప్రపంచ క్రికెట్‌లోనే అత్యధిక ఫస్ట్‌క్లాస్ డబుల్ సెంచరీల్లో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మ్యాన్ 37 డబుల్ సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. అలాగే రంజీల్లో ఇది పుజారాకు ఎనిమిదో డబుల్ సెంచరీ. పూజారా కంటే పారాస్ డోగ్రా (9) మాత్రమే ముందు ఉన్నాడు. ఈ డబుల్ సెంచరీతో పుజారా భారత జట్టులో స్థానంపై ఆశలు పెంచుకున్నట్లయింది. ఈ నెల 25 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. ఇంగ్లాండ్ ఇప్పటికే తమ జట్టును ప్రకటించింది. అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ త్వరలోనే భారత జట్టును ప్రకటించనుంది. దీంతో పుజారాను జట్టులోకి తీసుకోవడంపై సెలక్షన్ కమిటీ చర్చించే అకాశం ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68